నమ్మలేని నిజాలు

జలసాధన
కలనిజమాయెనా
నీటి బుడగ.

సారతుపాను
విలయవలయాలు
తాకితే బూది.

లోహ తునీగ
భయంకర ఆయుధం
జ్ఞాన నైపుణ్యం

అమ్మోరి రథం
జనాల మనోరథం
కరోన ఖతం.

డబ్బుంటె పార్టీ
కొత్త రాజకీయాలు
పేరుకే జనం.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

ఇప్పటికింకా దళితుల
సమానత పెరుగనులేదు !
ఉన్నా రిజర్వేషన్లు
అభివృద్ధి జరుగనులేదు !

దళితబంధు పథకంతో
నింపుతాయ వెలుగులు !
పాలు రాక బర్రెతంతె
దూడ మెడకు తలుగులు.

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ | గురువారం 19-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 15 | పేజీలు:6 | వెల: రూ.1/-

## చట్టసభలకు అంతరాయం కలుగకుండా చూడాలి : వెంకయ్యనాయుడు




బెంగళూరు, ఆగష్టు 18:: ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించాల్సిన చట్టసభల సమావేశాలకు తరచుగా కలుగుతున్న అంతరాయాల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థ నవ్వులపాలు అవుతుండడం పట్ల ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు (ఎవనిఎజీతిజీష్ట ఔజీతిటబీ) ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్, రాష్ట్రాల శాసన సభల సమావేశాలు అర్థవంతంగా ప్రజల జీవన ప్రమాణాలను పెంచే విధంగా, యువతకు ఆదర్శంగా ఉండి, ప్రజాప్రతినిధులు ఆదర్శనీయులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం బెంగళూరులో ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌కేసీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్మారక అవార్డు ప్రదానోత్సవంలో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల రాజ్యసభ సమావేశాలకు తరచూ అంతరాయాలు కలుగడం, సభ సజావుగా ముందుకు సాగకపోవడం తనకు ఎంతగానో బాధించిందని చెప్పారు. పార్లమెంట్ స్థాయిని దిగజార్చేలా కొందరు సభ్యులు ప్రవర్తించారని, ఇదే తనకు దుఃఖాన్ని కలిగించిందని తెలిపారు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థను, ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మరింత సుస్థిరం చేసేందుకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి మహనీయుల స్ఫూర్తితో నూతన ఆవిష్కరణల దిశగా యువత ముందుకు కదలాల్సిన అవసరం ఉన్నదని, ఈ దిశగా వారిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. దేశంలో క్షేత్రస్థాయిలో నూతన ఆవిష్కరణకోసం ప్రయత్నిస్తున్నవారిని గుర్తించి, ప్రోత్సహించి వారికి కావాల్సిన సహాయాన్ని అందించడం ద్వారా వారిని వాణిజ్యపరంగా బలోపేతం చేయవచ్చునన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుకునేందుకు అవసరమైన 'ఇన్నొవేషన్ హబ్స్' ను కళాశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఈ వేదిక ద్వారా మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘనంగా నివాళులు అర్పించిన ఉపరాష్ట్రపతి.. విశ్వేశ్వరయ్య ఆధునిక భారత నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన ఇంజనీర్ అని, మౌలికవసతుల నిర్మాత అని ప్రశంసించారు.

ఈ సందర్భంగా ఎమ్మెస్ రామయ్య గ్రూప్ సంస్థల చైర్మన్ డాక్టర్ ఎమ్మార్ జయరామ్‌కు ఎం విశ్వేశ్వరయ్య స్మారక అవార్డును వెంకయ్యనాయుడు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మాయ్, పార్లమెంట్ సభ్యులు పీసీ మోహన్, ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షులు పెరికల్ ఎం సుందర్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## జడ్జీల నియామకాల వార్తలపై సీజేఐ రమణ తీవ్ర అసంతృప్తి

న్యూఢిల్లీ, ఆగష్టు 18: కొత్త జడ్జీల నియామకంపై మీడియాలో వార్తలు రావడంపై సుప్రీంకోర్టు( ాబీజూతీవఎవ అనీబీతీబి ) ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాంటి నియామకాలపై రిపోర్ట్ చేసేటప్పుడు మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. కొత్త జడ్జీల నియామకంపై సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులు ఇవీ అంటూ మీడియాలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సిఫార్సుల ప్రకారం 2027లో దేశానికి తొలి మహిళా సీజేఐ రాబోతున్నారని, ఆమె కర్ణాటక జడ్జిగా ఉన్న నాగరత్నే కావచ్చని వార్తలు వచ్చాయి. అయితే ఇలాంటి నియామకాలపై అధికారిక ప్రకటన కంటే ముందే వార్తలు రావడం ప్రతికూల ప్రభావం చూపుతుందని ఎన్వీ రమణ అన్నారు.

జడ్జీల నియామక ప్రక్రియకు ఓ పవిత్రత, హుందాతనం ఉంటాయి. మీడియా స్నేహితులు ఈ ప్రక్రియ పవిత్రతను అర్థం చేసుకోవాలి, గుర్తించాలి అని రమణ అన్నారు. ఇలాంటి బాధ్యతా రహిత రిపోర్ట్‌ల కారణంగా అర్హులైన అభ్యర్థులకు పదవులు దక్కని ఘటనలు ఎన్నో ఉన్నాయి. వీటిపై నేను చాలా అసంతృప్తిగా ఉన్నాను. ఇలాంటి తీవ్రమైన అంశంపై సీనియర్ జర్నలిస్టులు, మీడియా హౌజ్‌లు కాస్త పరిణతితో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి అని సీజేఐ స్పష్టం చేశారు.

## సిరిసిల్లను సంపూర్ణ సస్యశ్యామలం చేస్తాం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ , ఆగష్టు 18:సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ యోగ్యమైన ప్రతి అంగుళం భూమికి సాగునీరు అందించి, సిరిసిల్లను సంపూర్ణ సస్యశ్యామల జిల్లాగా తయారు చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగానికి, సాగునీటి శాఖ అధికారులకు మంత్రి కే. తారకరామారావు బుధవారం దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో రాష్ట్రస్థాయి సాగునీటి శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా శాసన సభ్యులతో మంత్రి బుధవారం సుదీర్ఘ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

### మిగిలిన పనుల పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలి..

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా నూతన ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు ప్రస్తుత ప్రాజెక్టుల విస్తరణ ద్వారా సాధ్యమైనన్ని ఎక్కువ ఎకరాలకు సాగునీరు అందించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్ మేరకే సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ యోగ్యమైన ప్రతి అంగుళం భూమికి సాగునీరు అందించేలా ప్రయత్నం చేద్దామన్నారు. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు జలాల రాకతో జిల్లాలో భారీ ఎత్తున వ్యవసాయ సాగు పెరిగిందన్నారు. అయితే ప్రస్తుతం మిగిలిపోయిన పనులను పూర్తి చేయడం ద్వారా వ్యవసాయ సాగుని సంపూర్ణం చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా అధికారులను కేటీఆర్ ఆదేశించారు.

### ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు..

జిల్లాలో ఉన్న ప్రతి చెరువుని నింపడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న సాగునీటి వనరులు అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులకు సంబంధించిన సూక్ష్మస్థాయి ప్రణాళికలను సిద్ధం చేయాలని, ఈ దిశగా స్థానిక ప్రజాప్రతినిధులు, రైతాంగం సూచనలను సైతం పరిగణలోకి తీసుకోవాలని మంత్రి సూచించారు. జిల్లా పరిధిలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం, నియోజకవర్గాల పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేష్, రసమయి బాలకిషన్, సుంకే రవికుమార్ తదితరుల నుంచి క్షేత్రస్థాయి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న పనులను పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు ప్రభుత్వం నుంచి అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

### ప్రాజెక్టుల ఆయకట్టు వివరాలతో సమగ్ర నివేదిక..

ప్రస్తుతం కొనసాగుతున్న పనుల్లో అతి త్వరగా పూర్తయ్యే పనుల పైన దృష్టిసారించి, వాటిని పూర్తిచేసే దిశగా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామస్థాయిలో నీటి వనరులు వాటి కింద ఉన్న ప్రాజెక్టుల ఆయకట్టు వివరాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను తయారు చేయాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలతో పాటు ఇరిగేషన్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ కుమార్, పలువురు సాగునీటి శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




ఇన్నాళ్లకు అనంతలో
పచ్చని పచ్చిక
వేయడానికి
ఎద్దులేవీ!

గజ్జెల మల్లన్న
శంఖారావం
ఆఖరికి
గుడిగంటగా అవతారం.

కరువా!
నీకెంత శక్తే
పరువాన్ని సైతం
అంగడి పాలు చేశావ్

బతుకంటే
అంత ఆశ ఉంది గదా
మరి
ఇంత క్రోధమెందుకు?

ఆ బోడి గుట్టలు
వొట్టి రాళ్లు కావు
అడవుల నరికివేతకు
సాక్షులు



-ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
9440222117

## ఓయూలో బండిసంజయ్ దిష్టిబొమ్మ దహనం

హైదరాబాద్ , ఆగష్టు 18:ఓయూలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నేతలుఉస్మానియా యూనివర్సిటీ : మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని టీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంజయ్ పాదయాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. సంజయ్ వ్యాఖ్యలకు నిరసనగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తుంగబాలు మాట్లాడుతూ నోరుంది కదా అని ఎలా పడితే అలా మాట్లాడితే కుదరదని అన్నారు.

ఇప్పటికైనా ఆయన తన తీరు మార్చుకోకపోతే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు. వెంటనే బండి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పాదయాత్రతో సహా రాష్ట్రంలో ఎక్కడ తిరిగినా అడ్డుకుంటామని హెచ్చరించారు. దేశ అత్యున్నత చట్టసభ సభ్యుడిగా ఉన్న సంజయ్ ఆ పదవిని అవమానిస్తున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ గౌరవం గురించి తెలుసుకుని ప్రవర్తించాలని హితవు పలికారు. ప్రజలను రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## ఆ విమాన చక్రంలో మానవ శరీర భాగాలు: అమెరికా

కాబూల్, ఆగష్టు 18:: కాబూల్ విమానాశ్రయం నుంచి ఆదివారం ఎగిరిన అమెరికా వైమానికదళ కార్గో విమానంపై ఎక్కేందుకు జనం ఎగబడిన విషయం తెలిసిందే. తాలిబన్ల నుంచి తప్పించుకునేందుకు.. పరుగులు తీస్తున్న విమానాన్ని ఎక్కేందుకు ప్రయత్నించారు. టర్మాక్‌పై కూర్చుకున్న కొందరు విమానం గాల్లోకి ఎగిగిర తర్వాత కింద పడ్డారు. ఆ దృశ్యాలు అందర్నీ కలిచివేశాయి. అయితే సీ-17 గ్లోబ్‌మాస్టర్ సైనిక విమానంపై ఎక్కిన కొందరు దాన్ని వీల్ భాగంలో దాక్కున్నారు. సుమారు 600 మందితో వెళ్లిన ఆ విమానం ఖతార్‌లోని అల్ ఉబెయిద్ ఎయిర్‌బేస్‌లో దిగింది. కానీ ఆ విమానం అక్కడ దిగిన తర్వాత వైమానిక దళ సభ్యులకు మరో షాక్ తగిలింది. విమాన చక్రం (వీల్) భాగంలో మానవ శరీరభాగాలు, అవయవాలు కనిపించినట్లు వైమానిక దళం ఓ ప్రకటనలో తెలిపింది.సరుకులతో వచ్చిన తమ విమానం కాబూల్‌లో ల్యాండైన కొన్ని క్షణాల్లోనే వందలాది మంది వచ్చి ఎలా దాన్ని ఆక్రమించారో తెలియదని అమెరికా తన ప్రకటనలో పేర్కొన్నది.గ్లోబ్‌మాస్టర్ సైనిక విమానం సరుకును దించకముందే.. ఆ విమానాన్ని వందలాది మంది చుట్టుముట్టినట్లు అధికారులు తెలిపారు. అయితే పరిస్థితి అదుపుతప్పుతున్నట్లు తేలడంతో.. తక్షణమే సీ-17 విమానాన్ని అక్కడ నుంచి తరలించినట్లు ఆ ప్రకటనలో చెప్పారు. కాబూల్ విమానాశ్రయంలో జరిగిన ఘటన పట్ల విచారణ చేపడుతున్నట్లు అమెరికా వైమానిక దళం చెప్పింది. విమానాశ్రయం వద్ద ఏర్పడ్డ గందరగోళంలో పలువురు మృతిచెందినట్లు తెలుస్తోంది. ఎంత మంది మృతిచెందారన్న విషయాన్ని స్పష్టం చేయలేదు.

## మహీంద్రా వర్సిటీ డీన్‌గా మాడభూషి శ్రీధర్



మహీంద్రా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా డీన్‌గా ప్రముఖ విద్యావేత్త కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమీషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ వర్సిటీ వీసీ డాక్టర్ యాజులు మేడూరి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాడభూషి శ్రీధర్ గతంలో నల్సార్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా, రిజిస్ట్రార్‌గా సేవలందించారని తెలిపారు. 2021-22 విద్యా సంవత్సరం నుంచి మహీంద్రా విశ్వవిద్యా లయంలో న్యాయ కోర్సుల కోసం స్కూల్ ఆఫ్ లాను నులకొల్పామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐదేండ్ల ఇంటిగ్రెటెడ్ బీబీఏ ఎల్‌ఎల్‌బీ (హానర్స్), బీఏ ఎల్‌ఎల్‌బీ (హానర్స్) కోర్సులను అందిస్తామని తెలిపారు.

## సంక్షేమానికి చిరునామా తెలంగాణ : మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, ఆగష్టు 18:: సంక్షేమ పథకాల అమలులో దేశంలో తెలంగాణ నంబర్ వన్ అని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలోని గోపాల్‌పేట మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం అంకూర్ సమీపంలో గుడ్డిమోత వాగుపై నూతన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

గోపాల్ పేట మండలం బుద్దారం వనపర్తి రహదారి నుంచి ధర్మతండాకు రూ.68 లక్షల వ్యయంతో నిర్మించే రహదారికి శంకుస్థాపన చేశారు. రూ.2.9 కోట్లతో రేవల్లి మండలం తల్పునూరు కేశంపేట (వయా తల్పునూరు తండా) రహదారికి పాత తండా వద్ద శంకుస్థాపన చేశారు.



అలాగే గోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో న్యూమోకోకల్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించి, సిజెంట కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పది నూతన బెడ్లు ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, జేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో సెప్టెంబర్ 1 నుంచి బడులు ప్రారంభం..!

చెన్నై, ఆగష్టు 18:: దేశంలో కరోనా మహమ్మారి ప్రభావం తగ్గుముఖం పట్టడంతో వివిధ రాష్ట్రాలు పాఠశాలలు, కళాశాలలను పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. తాజాగా తమిళనాడు ప్రభుత్వం కూడా 9 నుంచి 12 వ తరగతి విద్యార్థుల కోసం బడులు తెరిచేందుకు (ాఇఃష్ట్రనీనీశ్రీబ తీవనీజూవని ) అనుమతించింది. సెప్టెంబర్ 1 నుంచి పాఠశాలలను ప్రారంభించనున్నట్లు తమిళనాడు విద్యాశాఖ వెల్లడించింది.

అయితే, పాఠశాలల్లో కొవిడ్ నిబంధనలను కఠినంగా అమలు చేయనున్నట్లు విద్యాశాఖ పేర్కొన్నది. విద్యార్థులు, టీచర్లు, ఇతర సిబ్బంది కచ్చితంగా వ్యాక్సిన్ చేయించుకుని ఉండాలని ఆదేశించింది. వ్యాక్సిన్ వేయించుకోని టీచర్లు, విద్యార్థులను స్కూళ్లలోకి అనుమతించబోమని స్పష్టంచేసింది.

## సబ్సిడీ వంట గ్యాస్ ధర రూ.25 పెంపు

న్యూఢిల్లీ, ఆగష్టు 18: ప్రజలపై గ్యాస్ బండ భారం నెలనెలా పెరుగుతూనే ఉన్నది. సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్ ధర మరో రూ.25 పెరిగింది. మంగళవారం సబ్సిడీయేతర వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.25 పెంచిన ఆయిల్ కంపెనీలు, తాజాగా సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్ ధరను కూడా రూ.25 పెంచాయి. ఆయిల్ కంపెనీలు వెల్లడించిన ధరల ప్రకటన ప్రకారం.. ఇప్పుడు ఢిల్లీలో 14.2 కేజీల వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.859కి చేరింది. తాజా పెంపుతో వంటగ్యాస్ ధరలను వరుసగా రెండు నెలలు పెంచినట్లయ్యింది. జూలై 1న కూడా సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.25.50 పెరిగింది.

సబ్సిడీయేతర వంటగ్యాస్ సిలిండర్ ధరను ఆగస్టు 1న కూడా పెంచారు. అయితే అప్పుడు సబ్సిడీ సిలిండర్ ధరల జోలికి వెళ్లలేదు. ఆ సమయంలో పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసనలు జోరుగా కొనసాగాయి. పెగాసస్ స్పైవేర్, ద్రవ్యోల్బణం, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా విపక్షాలు మండిపడ్డాయి. అందుకే అగ్నికి ఆజ్యం పోసినట్లు అవుతుందన్న భయంతో అప్పుడు ప్రభుత్వం సబ్సిడీ వంటగ్యాస్ ధరలను పెంచకుండా ఆయిల్ కంపెనీలను నిలువరించిందని ప్రచారం జరుగుతుంది.

కాగా, వంటగ్యాస్‌పై సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసే ప్రణాళికలో భాగంగా ప్రతి నెలా క్రమంగా వంటగ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.165 పెరిగింది. ఇక 2014, మార్చి 1 నుంచి అంటే గత ఏడేండ్లలో సిలిండర్ ధర రెట్టిపయ్యింది. అప్పుడు రూ.410 ఉన్న సబ్సిడీ సిలిండర్ ధర ఇప్పుడు దాదాపు రూ.900కు చేరువైంది.

## మహిళలకు అవకాశం ఇవ్వరా.. ఆర్మీ తీరును తప్పుపట్టిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగష్టు 18:భారత సైన్యం తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఎన్డీఏ పరీక్షలను ( ఔఆం ఇఎీజీఎబ ) మహిళలు రాసేందుకు అవకాశం ఇవ్వకపోవడం పట్ల ఆర్మీ తీరును సుప్రీం ఖండించింది. సెప్టెంబర్ 5వ తేదీన జరగనున్న ఎన్డీఏ పరీక్షలో మహిళలకు అవకాశం ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం తన తాజా ఆదేశాల్లో పేర్కొన్నది. తమ విధివిధానం ప్రకారం మహిళలకు స్థానం కల్పించడం లేదని కోర్టుకు ఆర్మీ తెలిపింది. ఆర్మీ ఇచ్చిన వివరణ పట్ల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ విధానం లింగవివక్షతో కూడుకుని ఉన్నట్లు కోర్టు ఆరోపించింది. తుది ఆదేశాలకు లోబడి అడ్మిషన్లు ఉంటాయని కోర్టు తన తీర్పులో తెలిపింది.

## విషాదం : చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

అమరావతి, ఆగష్టు 18: కడప జిల్లాలో విషాద ఘటన జరిగింది. సరదాగా చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. చిన్నమండెం మండలం సద్దలగుట్టపల్లె గ్రామంలో ఇవాళ మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. మృతులను ఓబన్నగారి పల్లెకు చెందిన తరుణ్ (16), ఉపేంద్ర (14)గా గుర్తించారు. పీర్ల పండుగ కోసం విద్యార్థులు ఓబన్నగారి పల్లె నుంచి సద్దలగుట్ట పల్లెకు వచ్చినట్లు తెలుస్తున్నది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విద్యార్థుల మృతదేహాన్ని చెరువు నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు రంగయ్య, రామస్వామి

హైదరాబాద్ , ఆగష్టు 18: విద్యార్థులు, యువత జీవితాలను మార్చేందుకు విశేష కృషి చేసిన టీచర్లకు కేంద్రం ప్రతీ ఏటా ఇచ్చే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా మొత్తం 44 మంది ఉపాధ్యాయులు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపికవగా వారిలో ఒకరు ఆసిఫాబాద్ జిల్లా సావర్‌ఖేడ్ ప్రధానోపాధ్యాయుడు రంగయ్య మరొకరు సిద్దిపేట ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రామస్వామి.

ఉపాధ్యాయ వృత్తిని సామాజిక సేవగా భావించి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేలా కృషి చేసిన హెచ్ఎంలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అభినందించారు. నిరుపేద విద్యార్థుల పట్ల చూపిన చొరవ సిద్దిపేట ఇందిరా నగర్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రామస్వామి పనితీరుకు, సంకల్పానికి ఈ అవార్డు నిదర్శనమని మంత్రి కొనియాడారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ పరదేశములో నున్నను
పరమార్థము తెలిసినట్టి ప్రతిభాశాల్మ నిగా
వర శతము గుర్తించెను
నరసింహలఘు - ఘనుడు - 'సత్యానాదెండ్ల' పవున్ !!

( ఆగష్టు 19. సత్యనాదెండ్ల పుట్టిన రోజు..)

-రాధశ్రీ
సెల్: 9494481210



ఆహ్వానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
నృత్య కిన్నెర

75 వసంతాల స్వాతంత్ర్యోత్సవాల సందర్భంగా

అమృతోత్సవ భారతి
కూచిపూడి నృత్య రూపకం

ఆదివారం 22-08-2021, సా॥ 6 గంటలకు
రవీంద్రభారతి, హైదరాబాద్

ముఖ్యఅతిథి : డా॥ కె.వి. రమణ, ఐఎఎస్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

సభాధ్యక్షులు : శ్రీ బాదిమి శివకుమార్
అధ్యక్షులు, తెలంగాణ సంగీత నాటక అకాడమి

విశిష్ట అతిథి : శ్రీ మామిడి హరికృష్ణ
సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

గౌరవ అతిథి : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీ వేత్త

'అమృతోత్సవ భారతి'
కూచిపూడి నృత్య రూపకం
రచన : జ్ఞాని సంగీతం: శ్రీమతి శ్రీవల్లీ శర్మ
కొరియోగ్రఫీ : హంస అవార్డు గ్రహీత డా॥ మద్దాళి ఉషాగాయత్రి

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి)
అధ్యక్షులు

మద్దాళి రఘురామ్
కార్యదర్శి



నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 19-8-2021



-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

## నేటికవిత-కవిత్వ విశ్లేషణ



-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

నేటికవితలో ఈ వారం: 'ఊపిరి ఉన్నంతవరకు'
అనే అంశంపై వచ్చిన 52 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన

### ఊపిరాడని మనసు

మొదలైన ప్రతీక్షణం నీతోనే..
నీ సాహచర్యాన్ని అనుభూతిస్తూ నేను..
నా అంత:చక్షువులకు మాత్రమే
తెలిసిన నువ్వు..!
ఎదురుపడే వేళ ఊపిరాడదేమో
నా మనసుకు.
ఘనీభవించిన కాలాన్నీ..
గడ్డకట్టిన కన్నీళ్ళనీ..
నీ ఎదురుచూపుల్లో
ప్రవహింపజేస్తున్నా..!.
తారల తళుకు..
సూర్యుడి మెరుపు
నీ ముందు దిగదుడుపు.
నా అద్భుతమే నువ్వు
సుఖ దు:ఖాలకు
చీకటి వెలుగులకు
అతీతమైన మన ప్రేమకు
ఆయుష్షుపోసే క్షణాలకోసం
ఊపిరున్నంతవరకు వేచి చూస్తుంటా..!.
దాచిన ప్రతి జ్ఞాపకపు చెమరింతా
నీకోసమే..
పొలమారుతున్న ప్రతిసారీ
నీ రూపే కళ్ళలో..
వస్తావు కదూ..
వేలమైళ్ల దూరాన వున్న నాకోసం..!



-కోసూరి జయసుధ
9010411955

పూళ్ల (ఏలూరు)కు చెందిన కవయిత్రి కోసూరి జయసుధ గారు ఊపిరిఉన్నంతవరకు అంశంపై ఊపిరాడని మనసు శీర్షికతో రాసిన కవితలో అంత:చక్షువులకు మాత్రమే తెలిసిన నువ్వు వేల మైళ్ల దూరంలో ఉన్నా నా కోసం వస్తావు కదూ.. అంటూ తమకు ప్రియమైన వారి కోసం నిరీక్షిస్తూ తమ భావాలను అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు. నిరీక్షణ యొక్క మధురిమలను బలంగా ప్రకటించడానికి కవయిత్రి చేసిన ప్రయత్నం ప్రశంసనీయం. ఎత్తుగడలోనే మొదలైన ప్రతీక్షణం నీతోనే అంటూ అంతరంగంలో కదలాడే తమవారి అనుభవాలను అనుభూతులను అందంగా అక్షరాలలో నిక్షిప్తం చేశారు. నా అంత:చక్షువులను మాత్రమే కనపడే నువ్వు.. నా ఎదుట పడే సమయాన మనసుకు ఊపిరాడదేమోనని ప్రకటించడం బాగుంది. నీ ఎదురుచూపుల్లో ఘనీభవించిన కాలాన్నీ.. గడ్డకట్టిన కన్నీళ్లనీ.. ప్రవహింపచేస్తున్నానని చెబుతూ కవితా శీర్షికకు అంశం వెలుగులో బలంచేకూర్చారు. తారల తళుకు..సూర్యుడి మెరుపు నీ ముందు దిగదుడుపేనంటూ కవితను కొనసాగించిన తీరు అభినందనీయం. సుఖదు:ఖాలకు,చీకటివెలుగులకు అతీతమైన మనప్రేమకు ఆయుష్షు పోసే క్షణాల కోసం ఊపిరి ఉన్నంతవరకు వేచిచూస్తానంటూ.. నిరీక్షణలో పొందే అనుభూతులను.. మనసులో కదలాడే ఆలోచనలను అందంగా ఆవిష్కరించారు. సుఖదు:ఖాలకు, చీకటి వెలుగులకు అతీతంగా మన ప్రేమను కొనసాగిస్తున్న నువ్వు నిజంగా నా అద్భుతానివే నంటూ తేల్చిచెప్పారు.

మనసులో సవ్వడిచేసే మధుర భావనలను ఎదురుచూపులలో పొందే గొప్ప అనుభూతులను ప్రకటించే క్రమంలో కవయిత్రి జయసుధ గారు అలతి..అలతి పదాలను ప్రయోగించి పాఠకులను మెప్పించారు. దాచిన ప్రతి జ్ఞాపకపు చెమరింత నీ కోసమే.. పొలమారుతున్న ప్రతీసారీ.. నీరూపే నా కళ్లలో అంటూ కవితను కొనసాగించడం బాగుంది. వస్తావు కదూ.. వేలమైళ్ల దూరాన ఉన్న నాకోసం అంటూ చక్కని ముగింపునిచ్చారు. కవయిత్రి నర్మగర్భంగా ప్రకటించిన పంక్తుల్లో తమ ప్రియమైనవారు లేదా తమ ఆప్తులు లేదా అంత:చక్షువుల్లో కదలాడే ఆరాధ్యులెవరైనా అనుకునే విధంగా కవితను తీర్చి దిద్దడం అభినందనీయం.

### అక్షరాలు

నా మస్తిష్కంలోకి
ఏ శుభతరుణంలో
ప్రవేశించిందో
ఈ కవనశక్తి
ఈ సాహిత్య పిపాస.
అన్యాయాల మీద
అక్రమాల మీద
లెక్కలేనన్ని
కవితాబాణాలు ఎక్కుపెట్టా.
ఓన్న కవితైనా
రాయని రోజు
నిద్రపట్టదు నాకు.
నిద్రపట్టని రేయి
గగనంలో తారలు లెక్కిస్తుంటే
నా హృది తలుపులు తెరిచి
రా రమ్మని పిలుస్తాయి
అక్షరాల మిత్రులు.
ఇక తప్పదని
కలం పట్టుకుంటే
నావంకే చూస్తాయి
కవితలు రాయమని
అక్షరాలను మణుల్లా పొదగమని.
కవిత రాస్తుంటే
మనసుకెంత ప్రశాంతత
రాస్తూనే వుంటా
ఊపిరి ఉన్నంతవరకు
ఈ తనువు చితికి చేరేంతవరకు



-గజవెల్లి శ్రీనివాసాచారి
9059438068

కాజీపేటకు చెందిన సీనియర్ కవి గజవెల్లి శ్రీనివాసాచారి గారు ఊపిరిఉన్నంత వరకు అంశంపై అక్షరాలు శీర్షికతో రాసిన కవితలో ఊపిరి ఉన్నంతవరకు కవిత్వ సృజన చేస్తూనే ఉంటానని ప్రకటించారు. ఏ శుభతరుణంలో ఈ కవనశక్తి నా మస్తిష్కంలో ప్రవేశించిందో గానీ.. సాహిత్య పిపాస నాలో బలంగా నాటుకుందన్న అర్థం ధ్వనించే విధంగా ఎత్తుగడలోనే కవిత్వ రచనపై కవి శ్రీనివాసాచారిగారు తమకు ఉన్న మక్కువను ప్రకటించారు. తమ సాహితీయానంలో కవి.. అన్యాయాలు.. అక్రమాల మీద లెక్కలేనన్ని కవితా బాణాలను ఎక్కుపెట్టానంటూ చెప్పడం బాగుంది. సామాజిక చైతన్యం కోసం సమాజహితం కోసం అన్యాయాలను అక్రమాలను ఎండగట్టేటందుకు కవిగా తాను సందర్భోచితంగా తమ కలాన్ని సంధిస్తున్న సంగతిని సరళమైన రీతిలో ప్రకటించారు. కవిత్వ రచన తమ నిత్యకృత్యమైందనీ.. చిన్న కవితనైనా రాయనిరోజు నిద్రపట్టదని పేర్కొన్నారు.

నిద్రపట్టని రేయి.. ఆకాశంలో చుక్కలను లెక్కిస్తుంటే .. నా హృది తలుపులు తెరిచి .. అక్షరాల మిత్రులు రా రమ్మని పిలుస్తాయని చెప్పడం బాగుంది. నిద్రాదేవత అలకబూనిన వేళ.. అక్షరాలే సాంత్వననిస్తాయన్న సంగతిని నర్మగర్భంగా ప్రకటించారు.

ఇక తప్పదని కలంపట్టుకుంటే నావంకే చూస్తాయిఅక్షరాలు.. కవితలు రాయమనీ.. వాటిని మణుల్లా.. అందంగా అమర్చుమని మనసు మారాం చేస్తుందన్న అర్థం ధ్వనించేవిధంగా కవి శ్రీనివాసాచారి గారు తమ కవితను కొనసాగించారు.

కవి, తాను కవిత్వ సృజనలో ఉన్నంతసేపూ కవిత్వం రాస్తున్నంత సేపూ.. మనసు పొందే హాయిని.. ప్రశాంతతను తెలియజెప్పారు. మనసుకు ప్రశాంతతతోపాటు హాయిని కూర్చే కవిత్వ రచనతో తమకు అవినాభావ సంబంధం ఏర్పడిందని పేర్కొన్నారు.

నిరంతరం అక్షరసేద్యంలో నిమగ్నమవుతానని.. ఊపిరి ఉన్నంతవరకు కవిత్వం రాస్తూనే ఉంటాననీ.. తనువు చితికి చేరేంతవరకు... కవిత్వ సృజన ఆపనని తెలిపారు. కవి శ్రీనివాసాచారిగారు పదాడంబరాలకు తావివ్వకుండా ..సరళత్వానికి పెద్దపీట వేస్తూ కవిత్వంతో తమకు ఉన్న బంధాన్ని , అనుబంధాన్ని అక్షరాలలో బంధించి మనల్ని మెప్పించారు. అధ్యయనం ద్వారా .. కవి శ్రీనివాసాచారి గారు తమ కలానికి మరింత పదును పెట్టుకుంటారని ఆశిద్దాం..

### ఆత్మవిశ్వాసం తోడుగా

హోరున ఘోషించే సంద్రంతో
నా హృదయ వేదన చెప్పాలని
నడిరాతిరి బయలుదేరాను
చీకటి నన్ను చూసి పారిపోయింది
మానవ లోకం ముసుగు తన్ని
తమకు సంబంధమేమీ లేదన్నట్లు
గురకలు పెడుతూ నిద్రిస్తోంది
మేలుకొని పరులపై రాళ్లువేసి
పనిచేసి చేసి అలసి పోయింది
మధ్యరాత్రినందుకే ఎంచుకున్నాను
మనసు ముక్కలను ఏరుకున్నాను
ముసుగు వేసుకొని వెళ్లాను
తనలో కలుపుకొని సేదతీర్చమని
సాగరాన్ని బతిమాలాను
ముఖం చిట్లించి నా వైపు
అదోరకంగా చూసింది సంద్రం
నువ్వు పిరికిదానివి అంది
నేను చేసే పని సరికాదని అంది
తనలో ఎన్నో జీవరాసులున్నా
బడబాగ్నులెన్నో రగులుతున్నా
తరతరాలుగా అదరక బెదరక
గంభీరంగా ఉన్నాను కాబట్టే
తనని చూస్తే అందరికీ భయమని
తనజోలికి ఎవరూ రారంది
నాలో కూడా భయాన్ని వెళ్లగొట్టమంది
సమస్యలతో పోరాడుతూ ఊపిరి
ఉన్నంతవరకు బ్రతికి నువ్వేమిటో
లోకానికి తెలియజేమయంది
తగిలిన రాళ్ళను తీసుకొని తిరిగి
అదేవేగంతో విసిరి వేయమంది
ఆత్మవిశ్వాసం తోడుగా ఏ మాత్రం
జాగుసేయక తిరిగి వెళ్లమంది
అంతే...
మరో ఆలోచన లేకుండా
తెల్లారక ముందే గూడుచేరి
రెక్కలు విచ్చుకున్న పక్షిలా
లోకానికి సమాధానం చెప్పాలని
గుండెను ధైర్యంతో నింపుకుని
ఆనందంగా పయనమయ్యాను



-రమాదేవి బుక్కపట్నం
9849596053

హైదరాబాదుకు చెందిన కవయిత్రి రమాదేవి బుక్కపట్నం గారు ఊపిరిఉన్నంతవరకు అంశంపై ఆత్మవిశ్వాసం తోడుగా శీర్షికతో రాసిన కవిత ఆలోచనాత్మకంగా మలచబడింది.

కవయిత్రి రమాదేవి బుక్కపట్నం గారు తమ కవితలో సాగరాన్ని మొరపెట్టుకుంటున్నట్లు చేసిన ప్రయత్నాన్ని అందంగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. హోరున ఘోషించే సంద్రంతో తమ హృదయవేదనను చెప్పాలని అర్ధరాత్రి బయలుదేరినట్లు కవిత ఎత్తుగడలోనే పేర్కొని పాఠకుల్లో కవిత పట్ల ఆసక్తిని పెంచారు. చీకటి నన్నుచూసి పారిపోయిందనీ.. మానవ లోకం ముసుగుతన్ని తమకు సంబంధమేమీలేనట్లు గురకలు పెడుతూ నిద్రిస్తోందని పేర్కొంటూ నడిరాతిరిని .. చక్కగా దృశ్యమానం చేశారు. మనసు ముక్కలను ఏరుకున్నాను.. ముసుగు వేసుకుని వెళ్లాను.. తనలో కలుపుకుని సేదతీర్చుమని సాగరాన్ని వేడుకున్నానంటూ కవితను కొనసాగించిన తీరు బాగుంది.

బడబాగ్నులు లోలోన ఎన్ని రగులుకున్నప్పటికీ..సముద్రం గంభీరంగా ఉంటుంది. కనుకనే సంద్రం యొక్క సలహా తీసుకుని ఆత్మవిశ్వాసాన్ని నింపుకుందామన్న ఆశలో నడిరాత్రి సాగరంతో చేసిన అభ్యర్థనను నర్మగర్భంగా కవయిత్రి ఈ కవితలో చక్కగా పొందుపరిచారు. తనలో కలుపుకుని సేదతీర్చుమని సాగరాన్ని బ్రతిమాలాను. ముఖం చిట్లించి నావైపు అదోరకంగా సంద్రం చూసిందనీ.. నువ్వు చేసే పని సరికాదని, పిరికిపని అభిలషణీయం కాదని తనకు హితవు పలికినట్లు పేర్కొన్నారు.

తరతరాలుగా అదరక బెదరక ఉన్నాను కాబట్టే తనని చూస్తే అందరికీ భయమనీ.. తెలుపుతూ సంద్రంలా నాలోని భయాన్ని వెళ్లగొట్టమని సూచించింది. సమస్యలతో పోరాడుతూ ఊపిరి ఉన్నంతవరకు బ్రతికి నువ్వేమిటో లోకానికి తెలియజేయమందంటూ కొనసాగించిన తీరు బాగుంది. ఆత్మవిశ్వాసం తోడుగా ఏమాత్రం జాగుసేయక తిరిగి వెళ్లమని సంద్రం చెప్పిందనీ.. మరో ఆలోచన లేకుండా తెల్లారకముందే గూడుచేరి.. రెక్కలు విచ్చుకున్న పక్షిలా లోకానికి సమాధానం చెప్పాలని గుండెను ధైర్యంతో నింపుకుని ఆనందంగా పయనమయ్యాను... అంటూ మంచి ముగింపునిచ్చారు. అంశం వెలుగులో కవయిత్రి రమాదేవి గారు సందేశాత్మక కథను అల్లి.. కవితలో జొప్పించి. సంద్రాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్న సూచనతో ముగించారు. పదబంధ ప్రయోగంలో ఔచిత్యాన్ని పాటించారు. అభివ్యక్తిలో విలక్షణతను ప్రదర్శించారు.



## "దీపిక" అభ్యున్నతి సాహిత్య వ్యాస దీప్తి







అభ్యుదయ సాహిత్యోద్యమ స్ఫూర్తితో, మార్క్సిజం భావజాలంతో, ప్రగతిశీల దృక్పథంతో సామాజిక అధ్యయనం, అవగాహనతో, కలం కదిపే సాహితీవేత్త, వ్యవస్థీకృత దోపిడీ విష సర్పపు వేలపడగల మీద తాండవ మాడగలడు. నిష్కగల లోతైన దృష్టిగల సాహితీవేత్తకు, సైద్ధాంతిక పరంగా సమాజాన్ని సరితూసే సాహితీవేత్తకు, సాహిత్యమే స్నానం, పానం, మానం, గానం, ధ్యానంగా భావించడం వలననే సమాజాన్ని చైతన్య పరచే సాహిత్య సృష్టి చేయగలుగు తున్నాడని భావించవచ్చును. సాహిత్య సృష్టి ఎప్పుడూ ఆటవిడుపు చర్యగా భావించకూ డదు. దీన్ని అవిరామమైన కృషిగా అంగీక రించాలి. నేటి సమాజిక వర్తమాన జీవనశ్శైలిలో కాలానుగుణ్యంగా కని,విని, ఎరుగని నవనాగరిక నటనలు వెల్లువెత్తుచున్నాయి. వాటి మూలాలను పసిగట్టాలంటే సాహిత్య మూ అత్యాధునిక ధోరణిలో ముందుకు సాగాలి. సాహిత్యం సామాజిక లోతుల్లోకెళ్లి పరిశీలించాలి. పరిశోధించాలి, అక్షరాకృతి కల్పించాలి. ఈవాళ మతం మనిషిని మూఢ విశ్వాసాలతో కూడిన అజ్ఞానం వైపుకు నడిపిస్తూ తర్కజ్ఞానాన్ని హరిస్తుంది. అట్లే రాజకీయం మనిషిని స్వార్థానికి వాడుకొని భ్రమల్లో బతకమని ఆర్థిక అశక్తునిగా మార్చి, ఆధ్యాత్మిక భజనలు చేసుకోమంటుంది. సాహిత్యం కూడా సమాజానికి పట్టని మనిషిని దృష్టిలో పెట్టుకొని ఒక లక్ష్యం మార్గంలేని సాహిత్యాన్ని సృష్టిస్తూ మనిషిని తటస్థవాడిగా పచ్చి స్వార్థపరునిగా మారుస్తుంది. ఏది ఏమైనా ప్రపంచీకరణ ఫలితంగా ఊహించని రీతుల్లో సమాజంలో చలనాలు, సంచలనాలు సరికొత్త పోకడలు పోతున్నాయి. మానవ మనుగడ మీద చూపుతున్న దుష్టపరిణామాల్ని సమాజంలో సన్నిహితంగా పయనిస్తూ అభ్యుదయ భావావేశంతో స్పందించే సాహితీవేత్తలు మాత్రమే వాస్తవిక దృష్టితో రికార్డు చేయగలరు అనేది యథార్థమైన అంశం.

అభ్యుదయ భావాలు కలిగి, ఆధునిక తెలుగు సాహిత్య పరిణా మాలతో, సన్నిహిత సంబంధంగల రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రజాసాహిత్యం పట్ల అమోఘమైన అనుబంధం గల్గిన ఈయన "దీపిక" శీర్షికతో అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటిని వెలువరించాడు. ఈ గ్రంథాన్ని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ విజయవాడవారు జూన్ 2021న ప్రచురించారు. ఇందు 36 వ్యాసాలు ఉన్నాయి. ఈ వ్యాసాలను విషయ పరిజ్ఞాన సారాన్ని బట్టి, పది విభాగాలుగా విభజించి యేర్చి కూర్చారు. వ్యాసాన్నీ సరికొత్త సమాచారాన్ని దట్టించిన సాంద్రతర సమాచార గుళికలు. ఈయన కలాన్ని, గళాన్ని కరుడుగట్టిన అభ్యుదయ భావాలు వెలువరించడానికి అంకితం గావించాడని చెప్పవచ్చును. ఈయన స్వచ్ఛమైన రైతు బిడ్డ, కచ్చితమైన కమ్యూనిస్టు, కష్టాలు, కన్నీళ్ల లోతు లెరిగినవాడు. నేటి సామాజిక పోకడ లెరిగినవాడు. అందుకే వీరి సాహిత్యం సామాజిక అసమానతలను, దోపిడీని ఎత్తిచూపుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ కష్టజీవులకు వత్తాసుపలుకు తూంటుంది.

"సజీవ ప్రవంతి అభ్యుదయ కవిత్వం" గురించి రాస్తూ ప్రజా కవిత్వానికి శ్రీకారంచుట్టిన "తొలి ప్రజాకవి వేమన" అంటూ, ఆయన బ్రాహ్మణ భావజాలంపై ఏ విధంగా విరుచుకుపడింది అంధ, మూఢ విశ్వాసాలను ఆయన ఏ విధంగా తిరస్కరించింది ఎత్తిచూపారు. అట్లే గురజాడది అభ్యుదయ సాహిత్యోద్యమానికి ఏ విధంగా అడుగుజాడై నిల్చింది ఆవిష్కరించాడు. "ఎల్లి లోకము వొక్క యిల్లై వర్ణభేదము లెల్ల కల్లై" ప్రేమ బంధాలు వేడుకలవుతాయనే, ఆశాంశను వెల్లడించిన గురజాడ భవిష్యద్దర్శనం చేసిన యుగ కర్తగా, హేతువాద దృష్టితో మానవ సమాజాన్ని చూసిన మహోన్నతునిగా ఆవిష్కరించాడు.

రూప మార్పుతో అట్లే అభ్యుదయ కవిత్వం శ్రీశ్రీ కలం నుండి, వ్యాకరణాల సంకెళ్ళ విడిచి, ఛందస్సుల సర్ప పరిష్వంగం వదలి ఏ విధంగా పరుగులు పెట్టింది వెల్లడించాడు రచయిత.

'ఫిడేల్ రాగాల్‌డజన్" పరాచి కవిత్వంగాని, పాత విలువలను తిరస్కరిస్తూ పాత విశ్వాసాలను ప్రశ్నిస్తూ వచన కవిత్వానికి వన్నెల్దిన కుందిర్తి ఉద్యమ స్ఫూర్తిని ఎత్తిచూపాడు.

నిజాం పాలన ధిక్కరిస్తూ దాశరథి **"ఓ నిజాము పిశాచమా! కానరాదు/ నిన్ను బోలిన రాజు మాకెన్నడేని/ తీగలను తెంపి అగ్నిలో దింపినావు/ నా తెలంగాణ, కోటి రత్నాలవీణ"** అంటూ కవితాగ్నిధారై సాగిన తీరును అభివర్ణిస్తాడు రచయిత.

**"ఖబడ్దార్ హే నైజాం పాదుషా"** అంటూ గర్జించిన అభ్యుదయవాది ఆంధ్రాప్రాంతపు కవి సోమసుందర్‌ను, **"మగవాని యెదుట మగువ/ కట్టుబట్టలు బెరడులా ఒలిపిస్తే/ అడగండయ్యా అడగండీ/ ఇదా రామరాజ్యం/ ఇదా ప్రజారాజ్యం"** అంటూ కవితాలాపన చేసిన అవసరాల సూర్యారావును, తుమ్మల వెంకట్రామయ్యను మొ॥గు ఎందరో అభ్యుదయ కవుల్ని పాఠకుల ముందుకు తెచ్చాడు రచయిత. అంతేకాదు ప్రాపంచిక దృష్టితో రాసిన, కష్టజీవులకి కుడిఎడమల నిలబడ్డ, ప్రపంచీకరణను నిరసించిన, విముక్తే లక్ష్యంగా సాగిన, కవుల్నీ ఎత్తిచూపాడు రచయిత.

1940లో పరివర్తన కథలో దళిత జీవన చిత్రణ కఠోర వాస్తవాలుగా వెల్లడించాడు అందే నారాయణస్వామి. అట్లే గురజాడ రాఘవశర్మకూడా **"మాల మాదిగలం మనుషులంగామా/ కుక్కలకన్నా- తక్కువయ్యామా"** అంటూ నిలదీశాడు అంటారు.

చుండూరు మారణ కాండను రాస్తూ కె.శరత్ **"మాల వాడి రక్తంతో/ మల్లెతోట తడిసింది/ అగ్రవర్ణ దౌష్ట్యానికి/ దళిత గుండె గాయపడిందని"** గేయాన్ని వెల్లడించాడు. ఈ కవితో పాటు మరికొందరు, చెరుకు మల్లి సింగా కవితా సంపుటాలు, రాంభట్ల కృష్ణమూర్తి రాసిన నివాళి, వై. విజయకుమార్, ఏటుకూరి, డా॥యస్వీ సత్యనారాయణ, వేల్పుల నారాయణ, జి.వై.గిరి, సుద్దాల అశోక్‌తేజ, లలితానంద్, బిగుళ్ళ నిస్సార్, బానూరి మొ॥గు అరసం సభ్యులు దళిత స్ఫూర్తిని తమ కవిత్వంలో ప్రదర్శించిన తీరును ఎత్తిచూపారు.

దళిత వెట్టి చాకిరిని నిరసిస్తూ అభ్యుదయ రచయితలు కథానికలు, నవలలు, నాటకాలు, సాహిత్య విమర్శలు రాశారు. వారిని పాఠకులకు పరిచయం గావించారు.

"విద్యార్థి సాహితి" విభాగం క్రింద రాసిన కథలు రాయడం ఎలా? సాహిత్య పరిచయం" శీర్షిక క్రింద, శాంతి కృష్ణమూర్తి, పోలవరపు శ్రీహరిరావు, శార్వరి, కాళీపట్నం రామారావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, బి.యస్.రాములు, మహమ్మద్, ఖదీర్‌బాబు, అరసం వారి ప్రచురణ, ఘండికోట బ్రహ్మాజీరావు, మల్లాది వెంకట కృష్ణమూర్తి మొ॥గువారి కథలు రాసే మెలుకువలకు సంబంధించిన రచనలను పాఠకులకు పరిచయం చేశాడు రచయిత.

ప్రాంతాలవారిగా వెలువడిన కథా సాహిత్యాన్ని గూర్చి చర్చించాడు. ప్రసిద్ధ కవితా సంకలనాల పరిచయాన్ని పాఠకులకు అందించాడు.

ఈ రచయితకు నచ్చిన మెచ్చిన, సాహిత్యపు లోతు లెరిగిన డా॥ ఎస్వీ సత్యనారాయణ, సునీల్‌కుమార్‌గార్లను "ప్రేమ సత్రాలు" శీర్షిక క్రింద అద్భుతంగా ఆవిష్కరించారు. ఇంకా సంస్మరణలు, శ్రద్ధాంజలి, శతజయంతి నివాళి, మంచిమాటలు, విశ్లేషణ విమర్శ సాహిత్య చరిత్ర, కర్తవ్యం శీర్షికల క్రింద లోతైన సమాచారమందించే వ్యాసాలను పొందుపరిచాడు రచయిత.

ఈ గ్రంథం "దీపిక"ను తెలుగునాట విద్యారంగ సుదీప్తి, సాహిత్య సాంస్కృతిక విద్వన్మణి డా॥ నన్నపనేని మంగాదేవిగారికి అంకితమిచ్చారు. **"ప్రార్థన చేసే పెదవులకంటే, సేవచేసే చేతులు మిన్న"** అని రుజువు చేసిన విద్యావేత్త, మదర్ థెరిస్సా స్ఫూర్తితో బడిని అమ్మ ఒడిని చేసి, ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డలు మానసిక ఒత్తిడికి గురి కారాదనే ప్రగాఢంగా విశ్వసించి విద్యారంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన బాలబంధువు మంగాదేవిగారికి అంకితమివ్వడం పువ్వుకు తావి అబ్బినట్లుగా ఉంది.

పెనుగొండ లక్ష్మీనారాయణ తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నికగన్న సీనియర్ రచయిత. ఏదిరాసినా హృదయార్పణగా రాస్తాడు. అద్వితీయమైన అధ్యయనం, అవగాహనతో రాసిన "దీపిక" సామాన్య పాఠకులకు చైతన్యాన్ని రేకెత్తించే విధంగా, సాహిత్య విద్యార్థులకు సరైన విషయ సేకరణకు కరదీపికగా ఉపయోగపడుతుందనడంలో ఎట్టి అతిశయోక్తి లేదు. లోతైన సమాచారంతో ఇంతటి గొప్ప సాహిత్య దీపికను అందించిన రచయితకు నా హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

**ప్రతులకు:** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520 004
ఫోన్: 0866-2430302



కొండ్రెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి
సెల్ 99487 74243

### ఎడ తెగని ప్రయాణం

యథాలాపంగా నడుస్తున్నా..నడుస్తున్నా
కొన్ని నిట్టూర్పుల్ని కొన్ని నిస్పృహల్ని
కొంత క్లేశాన్ని కొంత ద్వేషాన్ని
నాలో ఇంకా తెగిపోని
విభిన్న ధృవాల ప్రేమ దారాల్ని
మూట గట్టుకొని నడుస్తున్నా నడుస్తున్నా..
ఎక్కడ వదలాలో తెల్వటంలేదు
ఎక్కడ గిరాటు కొట్టాలో తోచటంలేదు
మూట ముడివిప్పి ఎవరైనా చూస్తారేమో..!
ఇంతకాలం దాచుకున్న రహస్యం
కడుపుచించుకుని కాళ్ల మీద పడుతుందేమో..!
లోలోపల వెంపర్లాట
ప్రసవ వేదనకు మించిన వేదన
పచ్చగా చక్కగా గీసుకున్న
మూర్తిమత్వ ముఖచిత్రం
పీఠభూమిలా భీటలు వారుతుందేమో..!
నా భయమే నన్ను వెంటాడింది..వేటాడింది
ఏ కరాలకు ఏ శరాలకూ చిక్కలే
మూటను ఎక్కడా పడేయ బుద్ధికాలే
మళ్లీ భుజానికే ఎత్తుకున్నా
మళ్లీ యథావిధిగానే నడుస్తున్నా..
విస్తుపోయే విషయమేమిటంటే..!?
నా ముందు చాలా మందే ఇలా నడుస్తున్నారు
నా వెనక సుత ఇలానే వస్తున్నారు
మూటల్ని భద్రంగా భుజానికెత్తుకుని..!



-డా.కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

### పరస్పరవాగార్థాలు

జీవితానిచ్చేది తల్లి
జీవించటం నేర్పేది తండ్రి.

ప్రపంచానికి పరిచయం చేసేది తల్లి
ప్రపంచం చూపేది తండ్రి

ఆకలిని తెలుసుకొనేది తల్లి
ఆకలి విలువను తెలుపేది తండ్రి

శ్రద్ధ చూపేది తల్లి
బాధ్యత వహించేది తండ్రి

నడక నేర్పేది తల్లి
జీవనగమనాన్ని నేర్పేది తండ్రి

పడిపోకుండా కాపాడేది తల్లి
పడిన ఎలా నిలబడాలో నేర్పేది తండ్రి

ఆలోచనల ప్రతిరూపం తల్లి
నిజాల ప్రతిబింబం తండ్రి

అనుభవ పాఠాలు నేర్పేది తల్లి
అనుభవాలే పాఠాలుగా
నేర్చుకొనేలా చేసేది తండ్రి

చివరి ఊపిరి వరకు ప్రేమించేది తల్లి
ఏభావాలు చూపక ప్రేమించేది తండ్రి

పుట్టినప్పటి నుండి తెలిసేది తల్లి ప్రేమ
నాన్న అయ్యాక తెలుసుకొనేది తండ్రి ప్రేమ



-సంధ్య సుత్రావె,
ఫోన్:9177615967

### నానీలు

బాగుందని
అబద్దాన్ని నమ్ముతామా!
బాగాలేదని
నిజాన్ని వదిలేస్తామా!

పోరాటం అంటే
యుద్ధం కాదు
మౌనంగా ఉంటే
ఓటమీ కాదు

చదువుకున్నాని
గర్వమా!
ఇకనుంచి
బతుకు పాఠం చదువు

మనిషిని వెక్కిరిస్తూ
పక్షి గుంపు
వాటికి
ఐకమత్యమే సొంపు



-వద్దేపల్లి సంధ్య
సెల్:7036000123

### స్వయంజీవి

ఉతజలపూరితంబులగు
నూతులు నూరిటి కంటే"
నిన్నటి ఆదికవి కవిత్వ సుగంధాన్ని
అక్షరాలకు కళాయి పూసినోన్ని

మాటకు ప్రాణమిచ్చే రేషమున్నోన్ని
నేటి ఆదికవి సోమన్న దేశీ మడిలో
కవిత్వం నారు అలుకుతున్నోన్ని
మాటను మన్నించి గౌరవించి
మాటకోసమే రాజ్యాలు సామ్రాజ్యాలు
దారప్పొగులా వూదిన
రీతి రివాజులో ఉక్కు ఉంగాడి నోన్ని
మంచికి విధేయుణ్ణి,
మనిషి తనానికి భవదీయుణ్ణి
నా చేతులతో నేనే కొట్టుకునే
సొంత డబ్బాలు గంటలు లేనోన్ని
ఒకరి దీపం వెలుగులో
జాడ వెతుక్కునే గుణం లేనోన్ని
నీతిమాలిన జీవితాన్ని
క్షణ మైనా భరించని వాణ్ణి

ఒకరు ఛీ.. అని ఒకరు థూ ..అని
తనమొఖం మీదే ఉమ్మేసుకుని
తిరిగేంత దిగజారని వాణ్ణి
పనిగళ్ల చేతులిచ్చిన వృత్తి కళాకారున్నీ
ప్రపంచం గుర్తించిన
నకాషీ కార్మికుణ్ణి
గడియైనా ఇరాము ఎరుగని
గంటల ముల్లును
నా సత్తువతో రోజూ సరికొత్త
బతుకు దివ్వెని వెలిగించు కునేటోన్ని
నిత్య ఫ్యాక్టరీ చక్రాన్నీ
యంత్రాలకు నెత్తుటి గ్రీసుని
ఆత్మాభిమానం తప్ప
ఎవరి సానుభూతి చినుకులకు
దోసిలి పట్టని వాణ్ణి
ఈ చేతులు
పనికి అలవాటు పడ్డాయే కానీ
అడుక్కోవడానికి కాదు
నడుము వంచి
బాంచన్ అనడానికి కాదు
నేను స్వతంత్రుణ్ణి
స్వయం జీవిని.



-డా.ఉదారి నారాయణ
9441413666

### నిప్పురవ్వలు



సంత్రాలు అమ్మినా
మంత్రాలు అమ్మినా
వసంతాలు అమ్మినా
మహానగరం
దోపిడి తంత్రం!
మనిషి
మనీ యంత్రం!



జీవితమే
అణువణువున
యుద్ధరంగమైనప్పుడు
జీవించటానికి
తప్పదు పోరాటం!



ఖద్దరుకై
మీరు
పత్తి పండిస్తూనే
ఉండండి
మీ ఆత్మహత్యలకు
వారు
సంతాపం ప్రకటిస్తూనే
ఉంటారు!



- డా॥ విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

### భల్లం భాష్యం
## అసలైన కవికి అస్తమయం ఉండదు. ఓన్లీ ఉదయమే..!

ఒకసారి కలిస్తే- మంచి కవిత్వాన్ని మరిచిపోలేము. రెండసారి కలిస్తే తానే మనల్ని గుర్తించి పలకరిస్తుంది. అప్పటి నుంచి ఆ కవిత్వం మనకు గుర్తు కొస్తూనే ఉంటుంది. కవికీ పాఠకుడికీ మధ్య సంబంధాలకు పెద్ద బంధమే అక్కర్లేదు. ఒక కవిత్వ జ్ఞాపకం చాలు అని మనందరికీ కవిత్వం నేర్పుతుంది.

మానవ సంబంధాలలో విలువలకు మాత్రమే కాక, సాహిత్య, సామాజిక సంబంధాలలో విలువలకు కూడా కవిత్వం వేదిక కావాలి. పదవి, బిరుదు, సన్మానం, సత్కారం, సభాగౌరవం, ప్రభుపోషణం, ఇత్యాదులు కవిత్వ రచనలకు ఆదనపు పోషకాలు అయితే కావచ్చేమో కానీ- కవికి అవే జీవన సోపానాలు కావు- కాకూడదు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఇవ్వచూపిన పురస్కారాన్ని తిరస్కరిస్తూ, కలాన్నీ, గళాన్నీ, ప్రజలకు అంకితం చేసినందుకు ఎంత మూల్యం చెల్లించవలసినా వెనుకాడని కవులు ప్రజల నాలుకల మీద పది కాలాలపాటు జీవిస్తారు. వాళ్లే నిజమైన కవులు. వాళ్ళు కవిత్వం విస్తృతంగా కవిత్వం రాయకపోవచ్చు. కానీ వాళ్ళు కళ్లు తెరిసినా- మూసినా- కలలకంటున్నా- వింటున్నా మోగిస్తున్నా- భోగిస్తున్నా- వింటున్నా- వాళ్లు కవిత్వమనే కళను సాధారణ జనాలు కోసం అంకితం చేస్తుంటారు. కవిత్వ ప్రేమలో నివసిస్తూ- కవిత్వ ప్రేమలో గాఢంగా నిలదొక్కుకుంటూ, సంపూర్ణంగా కవిత్వ ప్రేమలో లీనమైపోతుంటారు.

చరిత్రకు కాల్పనికతని, భావానికి నినాదతను జోడించి, పునరుక్తి పంక్తులు విన్న, చదివిన వాళ్లకు కవిత్వం అంటే- కల్పితం అనిపించడంలో పెద్ద ఆశ్చర్యం అనిపించవచ్చు కాని- కవిత్వం కన్నా వాస్తవమే అధికమైనది అనిపిస్తుంది.

తీరిక సమయాల్లోనో, మెప్పించాలనో,ఆతృతలోనో కవిత్వం రాస్తే ఆయా కవులకు జాగానే ఉంటదిగానీ, దానిలో ఆత్మ అడ్రస్ కనిపించదు. దగ్గరవుతూ చదువుతూనే దూరంగా, అతి దూరంగా వెళ్లిపోతుంటాం. అలా కాకుండా సామాజికతను అవగాహన చేసుకొని, మంచి చెడులకు స్పందించే గుణం రక్తంలోనే కాదు కవిత్వంలో కూడా ఉంటే. మనం ఆ కవిత్వానికి మరింత దగ్గరవుతుంటాం. మనం దగ్గరయ్యే కవిత్వం మన కళ్లనిండా కనిపిస్తుంది. మనం ప్రేమతో ఎత్తుకోవాల్సిన కవిత్వం మెల్లమెల్లగా చల్లచల్లగా మన మనసుకు దగ్గరవుతుంది.

కవుల దెప్పుడూ అత్యక్త ఉపమా రూపాకాది అలంకారోక్తి కనుక వారిలోని రాజకీయ రచనా దర్శనం కేవలం సూచన మాత్రంగానే ఉంటుందేమో. వచన రచనల్లోనే రాజకీయం వాస్తవావరణంలో తిరుగుతుండటం వలన అవాంఛనీయ శిల్ప వైపరీత్యాలకు తావుంటుంది. రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయగల సంఘటనలూ, జీవితమూ, తీవ్ర సందర్భాలూ పదాల్లో ఒక్కొక్క తరి పరుగు తీస్తూ వుంటాయి.

కవితలోని అభివ్యక్తి విశేషాన్ని, సంవిధానాన్నీ అవగతం చేసుకుందుకు రెండు మూడు మారులైనా, అధ్యయనం చెయ్యాలి. ఆలోచిస్తూ అధ్యయనం కేవలం స్థూల దృష్టితో కవిత్వాన్ని చదివితే పాఠక హృదయం రసించజాలదు. సామాజిక వేదనామయ భావన అనితర సాధ్యమైనదిగా చప్పున స్ఫురణకు తెచ్చుకోవాలి. ఆ వేదనను సద్యః స్ఫూర్తిగా అవగతం చేసుకోవాలి. ఇతరమైన ఆంక్షల సూత్రాల శంకలు స్మరించుకోనక్కర్లేదు. తద్వారా కవి తన సంస్కారాన్ని వ్యక్తపరుస్తాడు.

స్వతహాగా స్వచ్ఛమైన కవి స్వేచ్ఛా పిపాసి. తెల్సో తెలియకో లేక తెల్సీ తెలియకో అప్రయత్నంగానే సమకాలీన కవిత్వంలోని భిన్న ధోరణుల్లో ఏదొక దానివైపు కొంత మొగ్గుతో వుంటాడు. ఆ పని నిజంగా స్వచ్ఛందంగా జరగకపోయినా అలా జరిగినట్లు చూపగల సమర్థులు చాలా మంది ఉన్నారు. ఎపుడైతే ఈ మితి మీరిన ఆపేక్ష ఓ పక్షం పట్ల పెరగనారంభించిందో మిగతా వాటికి దూరమవుతాడు.

ప్రాథమికంగా కవి కొంతలో కొంత శాంతంగా కనిపించినా, క్రమశః క్రమశా పరిణితి స్థితి వచ్చేసరికి తనని నిలువనీయని తీవ్రమైన బాధతో భాషని వెతుక్కుంటున్నట్లుగా కనిపిస్తుంటాడు. మనిషిగా బతుకునీడడానికి మంచి కవిత్వం కోసం పడుతున్నంత తపన అవసరమని చబుతుంటాడు. బతు కవిత్వానికీ మధ్య సాధరణీకరించిన సత్యంలో నిజానికి నిక్కర్చి అయిన కవి నిరంతరం అన్వేషిస్తూనే ఉంటాడు.

ఇవాల్టికివాళ మన కష్టాలన్నిటికీ కంప్యూటర్లు, ఇంటర్నెట్లు, వెబ్‌సైట్లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమే కారణమయినట్లు, కొందరు భావిస్తూ వుంటారు. అందులో కొంత నిజంలేకపోలేదు.కాని వాటివల్ల ప్రపంచానికి అసలు ఏ విధమైన మేలు జరగలేదన్నమాటలో అసలు నిజం లేదు. సాహిత్య, సాంస్కృతిక వికాశానికి అవి ఇతోధికమైన ప్రయోజనం చేర్చాయి. చేకూరుస్తున్నాయి.

అన్నానని కాదు గానీ- చాలా మంది పేరున్న కవులకంటే, చాలా మంది యువకవులు బాగా రాస్తున్నారు. అయితే వీరిలో ఎంతమంది కవిత్వాన్ని జీవనయాత్రా సహచరిగా తీసుకుంటున్నారు? మరెంత మంది నిరంతర అధ్యయన శీలురౌతున్నారు. ఎంత మంది సందర్భాన్ని బట్టి కీర్తికోసం మార్గాలు మార్చుకోకుండా నిబద్ధతతో వుంటున్నారన్నది కాలమే నిర్ణయిస్తుంది.

కవిత్వం ఎంత అందంగా ఉంటుంది. అనేక యాంత్రిక సమయాల్లో అది వచ్చి తన ఒడిలో మన తలపెట్టుకొని ఓదార్చి పోతుంది. కవిత్వాన్ని వర్తమానంతో సరిచూసుకోవాలి. లెక్కలు తేల్చాలి. సంధ్యా సమయాలలో, సాయుధ పోరాట స్వప్నాల్లో, పేదవాడి ఆకలి కన్నుల్లో, సామ్రాజ్యవాదుల వ్యూహాత్మక కదలికల్లో. నిట్ట నిలువుతా మునిగే కాపురాల్లో ఇంకా చెప్పాలంటే పాలకంకుల వంటి తీయటి మాటల మమకారాల్లో కవిత్వం కనువిందుచేయాలి.

అందరిలాగా కవి అనుక్షణం తననితాను తరుక్కుంటూ తన ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, ఆవేదనని, ఆవేశాన్ని ఆక్రోశాన్ని ఆపేక్షని తన అంతరంగం నుండి మనకు బదిలి చేసి నైరూప్యాన్ని సారూప్యం చేయగల అక్షరశిల్పి, ఎపుడూ అతన్ని ఏదో నిలువనీయని అసంతృప్తి, అసహనం. ఇది సానుభూతి అయినా సహానుభూతి అయినా దహించివేస్తుంది. అందులో దగ్ధమై తనను తాను పుటం పెట్టుకొని అక్షరాగ్నిలో మేలి ముత్యమై ప్రకాశిస్తాడు.

కవిత్వాన్ని ప్రాణవాయువుగా శ్వాసిస్తూ, జీవితంలోని ప్రతీ సన్నివేశాన్నీ, అనుభవాన్నీ కవితామయం చేస్తూ- కవి తనేమిటో తన కవిత్వంలో దొరికిపోతాడు. తనేమిటో, తన మూలాలు ఎక్కడెక్కడున్నాయో పట్టిచ్చే కవిత్వాన్నే రాస్తుంటాడు. ఈ మధ్య కొంతమంది కవులు తమ అనుభూతుల్ని వ్యక్తీకరించడానికి వివిధ రూపాల్లో తమ శక్తియుక్తుల్ని ఉపయోగించుకుంటున్నారు. అందుకు మనం అభ్యంతరం చెప్పాల్సిన పనిలేదు. కానీ- పదాల్ని విడగొట్టి, కృత్రిమ పదాల్ని సృష్టించడం వాటికి విపరీత అర్థాల్ని చెప్పడం, అన్వయ క్లిష్టత, అనన్వయాన్ని పనిగట్టుకొని సాధించడం సాధారణ సాహిత్య పాఠకుడికి అందుబాటులేని, సాంకేతిక పదాల్ని విశేషం వాడడం తగ్గిస్తే మంచిది...!!



-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

## వరద ప్రవాహం

అలాంటి ఇలాంటి వరద ప్రవాహం కాదది.

నిశ్శబ్ద యుద్ధంలా మదిలో మొదలవుతుంది.
ఆ వరద ప్రవాహం ఎవరికి కళ్ళకు కనిపించదు
ఆ చప్పుడు ఎవరి చెవులకు వినిపించదు.
ఎప్పుడు ఎలా మొదలవుతుందో తెలియదు.
ప్రవాహంఅంతా గుండెలోని నాలుగు గదుల్లో నిండి
ఆశల చాపను చుట్టేస్తుంది.
కకావికాలం చేసేస్తుంది.

మేఘాలు గర్జించి సముద్రాలు ఉప్పొంగుతేనో
వచ్చిన వరద కాదది.
అది మనుషులు సృష్టించిన వరద.
మనుషుల హృదయాల్లో పారే వరద.
ఆ వరదకు అడ్డు అదుపు ఉండదు.
ఎదలోని అన్నీమూలల్లో ప్రవహిస్తుంది.
మొక్కలై మొలుస్తున్న జీవితాన్ని
ఉప్పొంగే నీటిప్రవాహమై ముంచేస్తుంది.

చివరకు కన్నీరును మిగులుస్తుంది.
దానిముందు ఆశయాలన్ని నీటిమూటలే.

ఎన్ని అడ్డుకట్టలు కట్టిన ఆగదు ఆ ప్రవాహం.
నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది.
దుఃఖసాగరమై మనసుల్ని నింపేస్తుంది.
ఇలా వచ్చి అలా వెళ్లిపోయే వరదకాదది.
ముసురులా పట్టుకొని ముంచేస్తుంది.

నీలో ధైర్యమే వరదప్రవాహానికి అడ్డుకట్ట.
నీ ప్రయత్నమే ఎదలో చీకట్లను చీల్చే
వెలుగు రవ్వ.
జీవిత ప్రశ్నలకు కాలమే సమాధానం ఇస్తుంది.
నువ్వు ప్రయాణించే మంచిదారి ఎపుడు
నీ విజయాన్ని కోరుకుంటుంది.
దుఃఖప్రవాహాలెన్నోచ్చిన నీ ఎదలో వెలిగే
దీపాలను ఆర్పలేవు.
నువ్వు కార్యదక్షుడవై కదులుతున్నపుడు.



**–అశోక్ గోనే**
9441317361

## రక్షా బంధన్

మణికట్టుపై వెలిసిన ఆ బంధనం
అన్నాచెల్లెల అనురాగానికి ప్రతీక
ఒకరికిఒకరు కట్టుకున్న ఆ దారపు ఒప్పందం
తరతరాల తరగని స్నేహానికి సూచిక

మనసులు కలిపిన మమకారం
హృదిలో కట్టుకున్న ఆప్యాయతగోపురం
కష్టంలో తోడుండే అభయహస్తం
అపార్థాలకు తావీయని అమూల్య అనుబంధం

దారపు పోగుల్లో ధైర్యాన్ని రంగరించి
మనమంతా భారతీయులమని గర్వించే ఐక్యతాబంధం
మనిషికి మనిషే అండగా
మానవత్వం నిండగా
అందరమొకటేనని కాపాడేదే రక్షాబంధనం

బంధమేదైనా పిలుపేదైనా
నా అనుకున్నవాళ్లను ఆదరించే అపురూప బంధం
ఇగిరిపోని ఆత్మీయగంధం



**–అయిత అనిత**
8985348424

## నా భాషకు తోడుగా..

ఒడిగట్టిన దీపానికి
చమురు చుక్కను నేనవుతా
తరుగుతున్న భాషకు
తరగని మాటలను అందిస్తా...

బీడు వారిన భూములకు
చినుకు చుక్కలే శ్వాస
అమ్మలాంటి అజంతా భాషకు
అమృతం పంచడమే నా శ్వాస..

ఆకులు రాలిన చెట్టుకు
వసంతం వస్తుందనే సంతోషం

తెలుగు సాహిత్యానికి పట్టం
మరలా వస్తుందని నా ఆశ...

మబ్బు పట్టిన ఆకాశం
వర్షించి నిర్మలమవుతుంది
గ్రహణం పట్టిన భాషకు
ఉద్యమిస్తే సజీవం మై ఉంటుంది..

అన్యభాషలతో అడుగున పడ్డ
అమ్మ భాషతోనే మెరుగైన
జ్ఞాన అభివృద్ధిలో ముందుండి
నా తల్లి రుణం తీర్చుకుంటా..

అక్షరానికి నేను ప్రాణం మై
ప్రతి పదాలను రగిలించి
భావాల నిప్పులు కురిపించి
నా భాషకు తోడుగా సాగుతా..



**–కొవ్వుల ప్రసాద్**
9885066235

## తక్షణమే తీర్పు రావాలి

విజ్ఞానానికి ఇంత వయసోచ్చినా
చదువులెంత చరుకునిచ్చినా
చట్టమెంత హెచ్చరించినా
సెక్షన్లెన్ని కాపలా కాసినా
యువత పెడ మార్గం మారలేదు.
మనసు చేసే తప్పులు ఆగడం లేదు.

పైరాడే వయసులో పెచ్చరిల్లే స్వేచ్ఛ.
వెకిలి ఆలోచనలతో ఎగుర్తించే మనసు.

అహం మత్తులో దారి తప్పి
తీపి విషానికి వ్యసనమై
చేదు నిజాలకు దూరమై
ప్రేమఉన్మాదం నడివీధిలో

జడలు విప్పి వీరంగం తొక్కుతు
నెత్తుటి వ్రాతతో ప్రేమ భ్రమలో
బలి కోరే జీవితాలు నేరమయం.

సంఘమంటే భక్తి లేదు
పెద్దలంటే భయం లేదు
బతుకంటే ప్రీతి లేదు
జీవితమంటే లక్ష్యం లేదు.

కొవ్వెక్కిన కోరికను
పిచ్చెక్కిన ఆలోచనను
పొగరెక్కిన దమ్మును
మందులేని జబ్బును
క్షమించలేని ఘోరాన్ని

తరిమి కొడుతూ
అణిచివేస్తూ
తిరగపడుతూ
తగులపెడుతూ
నడివీధిలో నేరస్తులకు పాఠంలా
ప్రేమ పేర ఉన్మాదులకు హెచ్చరికలా
ముద్దాయి నుదుటిపై తక్షణమే
ఓ తీర్పును చెక్కేలా చట్టాలు
వడివడిగా ఓ కఠిన శిక్షను నడిపించాలి.
*( గుంటూరులో ప్రేమ ఉన్మాదానికి బలైన దళిత విద్యార్థిని రమ్య హత్యను ఖండిస్తూ....)*



**–చందలూరి నారాయణరావు**
9704437247

## అనంత శక్తివంతం అక్షరమే..!

గీతల సమాహారమే కాదు అక్షరం
తలరాతలు మార్చే ఆయుధమైతది !

అక్షరంలో సరస్వతిని చూస్తే..
నిన్ను నీకు పరిచయం చేస్తది !

మానవ జీవితానికి అర్థమే కాదు
పరమార్థం కూడా ప్రసాదిస్తది !

అక్షరానికి ప్రాణం పోస్తే..
అద్భుత ఫలాల వర్షం కురిపిస్తది !

అక్షరం ఆకారంలో చిన్నదే..
ఆకాశమంత భావ విస్తీర్ణమైతది !

అక్షరం నిశ్శబ్దంగా ఉన్నా..
అంతరిక్షమంత శబ్దం సృష్టిస్తది !

అక్షరం నిర్జీవమే కావచ్చేమో కాని..
మానవ జీవితాలకు అదో సంజీవనైతది !

అక్షరాన్ని సరిగ్గా సంధిస్తే..
రామబాణమై జయాల్ని కురిపిస్తది !

అక్షరాన్ని ఆరాధిస్తే...
పూజలందుకునే స్థాయికి చేర్చుతది !

అక్షరాన్ని గేలి చేస్తే..
బతుకును నవ్వుల పాలు చేస్తది !

అక్షరానికి భావ విషం పూస్తే..
నిలువెల్లా విషం నింపి సంపుతది !

అక్షరాల అల్లిక మరిస్తే..
అజ్ఞాన బిరుదు స్వంతమైతది !

జ్ఞానాలకి తొలి మెట్టే కాదు..
విజ్ఞాన శిఖర సోపానమవుతది !

అక్షరాన్ని నమ్మితే అమ్మ అవుద్ది..
అక్షరాన్ని అమ్మితే కర్మ కాలుద్ది !



**– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**
99497 00037

## నరజీవనప్రశస్తి

ఎన్నెన్ని జన్మలందే పున్నెమో గాని
సాహిత్యమందున సాగినావు
ఏ దేవతావరంబీ రూపు దాల్చెనో
వైదుష్యభాగ్యాన వరలినావు
ఏ తపోఽనుష్ఠాన మేకమై వచ్చెనో
కవనశక్తిని మది గాంచినావు
ఏ యుపాసన నిష్ఠకే సురల్ మెచ్చిరో
గళమున మధురిమలాలకినావు
విద్యలను గన నాసక్తి వేద్యమయ్యె
కళలనందగ నభిలాష గాంచనయ్యె
ధన్యుడవు నీవు మానవా! ధరణిపైన
సరస సంగీతసాహిత్యసహితచరిత!



—డా॥ అయాచితం నటేశ్వరశర్మ–
9440468557.

పుస్తక సమీక్ష

## సతీష్ గొల్లపూడి ప్రవాస ప్రతిబింబాలు




వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 87వ ప్రచురణ, ప్రవాస ప్రతిబింబాలు ప్రపంచంలోని ప్రవాస భారతీయుల జీవితాలను కవితా రూపకంగా ప్రతిబింబింపచేసిన కవితా సంపుటి. దాదాపు రెండు దశాబ్దాలుగా న్యూజిలాండ్‌లో వున్న సతీష్ గొల్లపూడి, ప్రత్యేకంగా ప్రవాస భారతీయుల సాఫల్య, వైఫల్యాలు, సుఖ సంతోషాలు, కష్టాలు కన్నీళ్ళు జీవిత వ్యధలను వ్యక్తిగత, సర్వజనీన అనుభూతులుగా వ్యక్తీకరించారు. ప్రవాసాంధ్రుల ప్రగతి, విజయ సాధనలు యిందులో ఆవిష్కరించారు. ప్రపంచపటంపై అడుగుపెట్టిన భారతీయుల బ్రతుకు పోరాటాలలో ఆశనిరాశలు, సంఘర్షణలు ఎన్నో అనుభవాలు చోటు చేసుకొన్నాయి.

'షేక్ మృగం, కవితలో షేక్ దుస్తులు వేసుకొని వచ్చిన మృగం గురించి

**'తమ పడతి వేలికొన అయినా
పరులకు కనిపించకూడదు కాని
పరస్త్రీని చెరబట్టే ద్వంద్వ ప్రమాణాలు
ముసుగులు వేసిన ఈ నేలలో
మోసపోతున్న నిర్భాగ్యపు చెల్లెళ్ల '**

జీవన విషాదం వ్యక్తమవుతుంది. 'ఫారిన్ అల్లుడు' కవితలో

**'విషాద వార్తలెన్ని చదివినా
కన్నీటి కథనాలెన్ని చూసినా
కళ్ళు తెరవని కన్యాదాతలు'**

అంటారు. కవి

పేపర్ మ్యారేజి కవితలో

**అగాధాల్లోకి జారిపోతున్న ఆశకు
ఆలంబనగా ఒక చిక్కుదారి
ప్రవాస జీవిత ఆరాటంలో
చివరి ప్రయత్నం–కాగితాలపై పెళ్ళి'**

అంటారు.

'ద్వేషరాగం'కవితలో జాతి వివక్షపై స్పందిస్తూ, ద్వేష రాగానికి,అసూయకు బలి అయిన 'కూచిబొట్ల' స్మృతి గుర్తు చేస్తారు.

'నామోషి' కవితలో ఎన్నారై అంటే ధనవంతులైన వృత్తి నిపుణులు అనే ముఖచిత్రం మారింది. సరికొత్త విద్యాధిక కార్మిక తరగతి నేటి వాస్తవం. జీవన్మృతులు కవితలో

**'కన్నీటి గుంతల్లో కాలాన్ని ఎంత ఈదిన
తీరం చేరని బతుకులు'** అంటూ, గల్ఫ్‌లో గాలికి కాసులు కాస్తాయని

**దుబాయ్‌లో మట్టికి బంగారం పూస్తదని
కనపడని దూరాల్లోని శవానికి
జాగారం చేస్తున్న జీవన్మృతులు.
తల్లిగడ్డనుండి విడవడిన ప్రవాస కణం
మరచిపోదా జన్మవృత్తం** అంటూ

ప్రవాస ప్రతిబింబాలు అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియాలాంటి పాశ్చాత్య ఖండాల ఆకర్షణ వర్ణాలు, గల్ఫ్, ఆఫ్రికా, ఆసియా శ్రామికుల చెమట పరిమళాన్ని ఆస్వాదింపచేస్తున్న అద్భుత కవితా సంపుటి.

**ప్రతులకు:** వంశీరామరాజు
సెల్: 98490 23852



**–జయసూర్య**
సెల్: 9440664610

## రెక్కలు

వెనక్కి
తగ్గిన
బాణమే
దూసుకెళ్తుంది–
వెనకడుగైనా
విజయానికి తొలి అడుగే!

ప్రాకులాడటం
అడుగులెయ్యడం
పరుగులు తియ్యడం
ఆయాస పడటం
నాలుగు బళ్ల పయనం
జీవితం!



**– పద్మకళ**
సెల్:99128 55195

## సహజీవన సామర్థ్యాన్ని, జ్ఞాపకశక్తిని, సంస్కారాన్ని,

# క్రియా నైపుణ్యాన్ని కలిగించేదే 'విద్య'-డాక్టర్ సర్వేపల్లి

'విద్య' అన్నది 'వజ్రం' లాంటిది. వివిధ కోణాల్లోంచి వివిధ రంగుల్లో కనిపిస్తుంది. ప్రాచీనులు భావవాదము లేక ఆధ్యాత్మిక విద్యా దృక్పథంతో వివరించారు. కానీ ఆధునిక ఆలోచనాపరులు విద్యను ప్రధానంగా ఆచరణ దృక్పథం నుండి వివరించారు.అంతమాత్రాన ప్రాచీన కాలపు విద్య తక్కువేమీ కాదు. విద్యా నిర్వచనాలు అటు ప్రాచీనములోనూ ఇటు ఆధునిక కాలం లోనూ అనేకులు అనేక విధాలుగా చెప్పినారు." మనిషి స్వావలంబకుడిగా నిస్వార్థిగా తయారు కావడానికి, మోక్షం సాధనకు దారితీసే విధానము, ఆత్మసిద్ధియే విద్య" అని ఆది శంకరులు ప్రవచించారు.



చరిత్ర ఎప్పుడూ ఆవృత్తమవుతూనే వుంటుంది. మానవుడెప్పుడూ అన్వేషణాశీలి.,విజ్ఞానమెప్పుడూ సార్వకాలికమే. దేశకాలాదులను బట్టి అలతి మార్పులుండవచ్చుగాని, మూల సూత్రములెప్పుడూ ఎక్కడా మారవు. 'విద్య' అనే శబ్దాన్ని '' ఆత్మవిద్య' అని ప్రయోగించినారు.కొంతమంది కళతో చేర్చి స్వీకరించారు. పుట్టుక నుండి మరణం దాకా కలిగే అనుభవ పరంపర 'విద్య'అని విస్తృతార్థం వాడినారు. 'విద్' అనే ధాతువు నుండి పుట్టిన'విద్య' శబ్దమునకు 'తెలుసు కొనుట'అని అర్థం. 'విద్'అనే శబ్దం నుండే 'వేదం' అనే పదం పుట్టిందని అంటారు. వేదం నుండే 'జ్ఞానం' 'అనే అర్థం వచ్చింది 'జ్ఞానం గమ్యం విద్య గమనం' దీని సమానార్థం 'ఎడ్యుకేషన్'. సంస్కృతం లో కూడా 'విండ్' అనే ధాతువుకు 'పొందుట' అని అర్థం వుంది. 'మానవునిలోని సహజ శక్తులను సమంగా ప్రగతి శీలం కావడానికి తోడ్పడేదే విద్య అని ప్రముఖ విద్యావేత్త పెస్టలాజీ అన్నారు. విశ్వ సత్యానికి సంబంధించిన భావాలను ఆవిష్కరింపజేయడమే 'విద్య' అని సోక్రటీస్ చెప్పారు. 'నీ లోని అత్యున్నత సామర్థ్యాన్ని వెలికితీసేదే అసలైన 'విద్య' అంటారు మహాత్మా గాంధీ. మానవునిలోని ప్రావీణ్యతను బయటకు లాగడమే 'విద్య'అని స్వామి వివేకానందులు అభిప్రాయం. శీల నిర్మాణమే విద్య అని శ్రీ అరవిందులవారి సూచన. ఇలా విద్య ను ఎన్నోవిధాలుగా నిర్వచించినా దేశకాల పరిస్థితులరీత్యా ఇంకా ఎన్నో వివరాలు అవసరమనిపిస్తాయి. విద్యవలన కలిగే ప్రయోజనములు అనేకం. అవి ఊహించనలవి కానివి.

"యదాపి పాసాం జయంతి పురుషం ప్రాప్యవైజలమ్. ఇష్టార్థో విద్యయా హ్యేవ న విద్యామ్ ప్రజహేత్ నరః." విద్య వలన ప్రయోజనాల సంఖ్య నిర్ణయించలేము. కావున విద్యా ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని చెప్పిన 'నిర్వచనాలు' సమగ్రమైనవని చెప్పడానికి వీలుకాదు.

''విద్యా నామ నరస్వరూపమధికం, ప్రచ్ఛన్న గుప్తంధనం. విద్యా భోగకరీయశస్సుఖకం, విద్యా గురూణా గురుః. విద్యాబన్ధుజనో విదేశ గమనే , విద్యా పరాదేవతా, విద్యా రాజసుపూజ్యతే నహిధనం విద్యా విహీనం పశుః... విద్యయే మనిషి రూపం,ఎప్పుడూ సుఖాన్ని ఇచ్చేది,ఇతరులకు ఇచ్చే కొద్దీ పెరిగేది,ప్రళయకాలంలో కూడా నశించని ధనం, గురువులకునూ విద్య బోధించేది, విదేశములందు బంధువు, ఉన్నత సభలందు గౌరవాన్నిచ్చేది విద్యయే. విద్య లేనివాడు వింత పశుప్రాయుడని భర్తృహరి సుభాషితం. ఆధునిక విద్యా విధానంలో కూడా ఉన్నత ప్రమాణాలు వున్నాయి కాని ఆచరణలు లోపభూయిష్టములైనవి. స్వాతంత్ర్యానంతరం విధానంలో మరింత అలసత్వం సంభవించుచున్నది. ఇలాగే కొనసాగితే విద్య హీనస్థితికి దిగజారుతుందనడానికి నేటి 'సర్వే'లు సాక్ష్యం. దీనికి కారణాలు కోకొల్లలు. ఈ సందర్భంగా మన ప్రాచీన విద్యా విధానం గురించి కొంత తెలుసుకోవలసిన అవసరం వుంది. " నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమం దేవీం సరస్వతీం వ్యాసమ్ తతో జయముదీరయేత్."

.. ఇది విద్యాసంప్రదాయాన్ని తెలిపే శ్లోకం. సర్వజ్ఞుడైన నారాయణుడు ఆచార్యుడని , నరోత్తముడంటే జిజ్ఞాసువులనిపించే విద్యార్థియని సరస్వతి జ్ఞానానికి ప్రతీక అని ఈ మూడింటి పరస్పర సంబంధానికి సూచకం. ప్రాచీన విద్యాభ్యాసం సమయం లో పాటించవలసిన పద్ధతులను ' అష్టవిధ మేధాశక్తులు'అనేవారు.శుశ్రూష, శ్రవణం, గ్రహణం, దారణం, ఊహ, అపోహ, అర్థం జ్ఞానం, తత్వ జ్ఞానం . ఆచార్యులను సంతోషపెట్టడం, వారి ఆజ్ఞను శిరసావహించడం,గురువుకు అనుకూలంగా ప్రవర్తించడం(శుశ్రూష), గురువు చెప్పిన విషయాలను ఎంతోకాలం వినడం(శ్రవణం), వాటిని అర్థం చేసుకొనడం(గ్రహణం), అర్థం చేసుకొన్నది మనసు లో నిలుపు కొనడం(ధారణం), అవసరమైన విషయాలను మాత్రమే స్వీకరించడం(ఊహ), అనవసరం విషయాలను వదిలివేయడం (అపోహ), అన్ని విషయాలు తర్కించి మంచిని మాత్రమే గ్రహించడం(అర్థ జ్ఞానం), గ్రహించిన మంచిని జీవితం లో ఆచరించడం(తత్వం విజ్ఞానం)అనే ఎనిమిది మేధాశక్తులు జ్ఞానదాహాన్ని తీర్చడానికి ఉపకరిస్తాయి. ఆ కాలంలో గురుకుల ప్రవేశానికి ధనం గానీ వంశంగానీ అర్హతలు కావు.కేవలం విద్యార్థి నడవడిక క్రమశిక్షణ మాత్రమే. పండ్రెండు సంవత్సరాల వయస్సులో ఆశ్రమంలో ప్రవేశించిన విద్యార్థి పండ్రెండు సంవత్సరాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి వెళ్ళి పోవాల్సి వుంటుంది.ఆచార్యులు విద్యార్థులకు విషయాలను బోధించడానికి కొన్ని పద్ధతులు వుండేవి. కథల ద్వారా (ఉపాఖ్యాన పద్ధతి), ఇద్దరు వ్యక్తులు పాల్గొని విషయాన్ని విశదపరచుకొనడం ద్వారా (సంవాద పద్ధతి)ఎన్నో విధాలుగా అభ్యసన నియమావళి వుండేది.గురువులు ధనాన్ని ఆశించేవారు కాదు. అక్కడ చదువు మాత్రమే గాక ప్రకృతిలో మమేకమై అన్ని ఋతువుల లోనూ సంచరించి వాటి ప్రభావాలను జీవితానికి ఎలా అన్వయింపజేసుకోవాలో శిష్యులకు అనుభవపూర్వకంగా నేర్పేవారు. పుట్టినది మొదలు పండ్రెండు సంవత్సరాల వరకు తల్లిదండ్రుల దగ్గర మరి పండ్రెండు సంవత్సరాలు ఆశ్రమంలో గడపవలసి ఉండేది. గురుకుల విద్యాభ్యాసం పూర్తి అయ్యేసరికి తమ సొంత కాళ్లపై తాము నిలబడి జీవించే అన్ని సూత్రాలను ప్రయోగాత్మకంగా అభ్యసించేవారు. శిష్యులు పాటించే క్రమశిక్షణలో శాంతము,ఆత్మ నిగ్రహం, స్వచ్ఛత, ఓర్పు, నిజాయితీ, బ్రహ్మ చర్యంలలో ఏది లోపించినా కఠిన చర్యలు తీసుకొనే వారు. అందువల్లనే వారు సమాజంలో ఆదర్శవంతమైన జీవితం గడిపేవారు. మన ప్రాచీన విశ్వవిద్యాలయాలు జగత్ప్రసిద్ధి పొందినవి. నలంద, తక్షశిల విద్యాలయాలలో వేలకొలది విదేశీ విద్యార్థులకు ఉచిత సదుపాయాలతో విద్యాదానం చేసిన దాఖలాలు వున్నాయి. ఆ కాలంలో విద్యా కేంద్రాలు కఠోర నిబంధనలతో నిర్ణీత పాఠ్యాంశాలను బోధించు సంస్థలను 'నిబద్ధ విద్యాకేంద్రము'లు అనేవారు. బౌద్ధయుగం లోనే ఇలాంటి సువ్యవస్థితమైన కేంద్రాలు

వుండేవి. వివిధ అధ్యయశాఖలకు వేర్వేరు అధిపతులుండే వారట. పరీక్షలు నిర్వహించడానికి,పాఠ్యప్రణాళికలు రూపొందించడానికీ, భోజనం సదుపాయాలు, వైద్యశాలలు, గ్రంథాలయాలకు తత్సంబంధమైన అధికారులుండేవారు. మతసంబంధమైన విద్యలేగాక కళలను వృత్తులను నేర్పే కేంద్రాలుగా బౌద్ధారామాలు వుండేవి.ఆ నాటి గురుశిష్య సంబంధం విద్యా విధానానికి అత్యంత ఆవశ్యకములు. పండిత లక్షణాలను భారతం లో వివరించారు. శ్రద్ధ, విషయ పరిజ్ఞానము, నిరంతర ప్రయత్నము, సహనము, వాక్ ప్రవాహము, చిత్రకళా నైపుణ్యము, ఇంద్రియ నిగ్రహము మొదలుగా గల లక్షణములను శిష్యులకు అభ్యసింపజేయడం ఆచార్యుల విధి.

అలాంటి విద్యా విధానాలు స్వరూప స్వభావాలు ప్రస్తుతం మారిపోయి రాను రానూ దిగజారి పోతున్నవనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. ప్రజలకు నిజమైన విద్య ఏమిటో తెలియక పోవడమే అసలు సమస్య. ఏ చదువు వల్ల డబ్బు ఎక్కువ సంపాదించ వచ్చునో ఆ వైపుకే మొగ్గుతారు. అంతేకాని జ్ఞానం కలిగించే చదువు అవసరం లేదు. విద్యకు విద్యార్థులు అంకితం , ఉపాధ్యాయుడు విద్యార్థులకు అంకితం అన్నది డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి ఉద్దేశ్యం.అంకితభావంలేని గురువు గురువు కాదని పెద్దలు నిర్ణయం. విద్యావిధానంలో లోపాలకు ఉపాధ్యాయుల అసమర్థత కూడా ఎంతో కారణమని చెప్పక తప్పదు. ఉత్తమ గురువుకు సమాజములోనే , విద్యార్థులలోనా ఎంతో భక్తిప్రపత్తులు వున్నవనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. సర్వేపల్లి వారి జీవితం లోనే ఎన్నో అలాంటి సందర్భాలు వున్నవి. వారు మైసూరు విశ్వవిద్యాలయం నుండి కలకత్తా విశ్వవిద్యాలయానికి బదిలీ అయి వెళ్ళిపోతున్న సమయంలో విద్యార్థులంతా కన్నీరు మున్నీరుగా విలపిస్తూ గుర్రపుబండికి అడ్డుపడి గుర్రాలను విడిపించి తమ భుజాలపై బండిని రైల్వే స్టేషన్ వరకు మోసుకొని వెళ్ళారంటే. ఆ దృశ్యాన్ని తిలకించినవారు అవాక్కయ్యారట. పూటకు కూడా గడవని నిరుపేద కుటుంబంలో పుట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు సర్వోన్నత పదవైన 'భారత రాష్ట్రపతి' అయ్యారు. మన సంస్కృతిలో ఉపాధ్యాయునికిచ్చిన గౌరవము ప్రపంచదేశాలలో ఎక్కడా కానరాదు. ఇంతటి గొప్ప విద్యావేత్తలను గన్న మన దేశం , ప్రపంచానికి ఒకప్పుడు విద్యాదాహం తీర్చినది నేడు కుప్పకూలిపోయే దిశగా పయనిస్తున్నది. క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దము నుండే పద్దెనిమిది వందల సంవత్సరాల తరబడి నలంద, తక్షశిల, విక్రమశిల, వల్లభి వంటి విశ్వవిద్యాలయాలు ప్రపంచ ఖ్యాతినార్జించి నాయి. నేటి మన స్థాయిని ఇతర దేశాలతో పోల్చుకొనే స్థితిలో లేము. పరిశోధనా పత్రాల సమర్పణలో గానీ, పెటెంట్ల సాధనలలోగాని అత్యల్ప స్థాయికి దగ్గరలో వున్నాము. దీనికి కారణం మనకు మెరికల్లాంటి ఉపాధ్యాయులు లేకపోవడమూ, ఆచరణ లోపాలు, ప్రభుత్వ విద్యాసంస్థల బలహీనత, కార్పొరేట్ సంస్థలు విజృంభణ, పర్యవేక్షణా లోపాలు మన విద్యా ప్రమాణాలను మరింత బలహీన పరుస్తున్నాయి. దీనికి తోడు కార్పొరేట్ విద్యా సంస్థల ప్రలోభాలు మితిమీరుతున్నాయి. పసి పిల్లలకే త్రిపుల్ ఐటీ ఫౌండేషన్ ఇత్యాది 'బడాయి' ప్రణాళికలు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. త్వరలో గర్భస్థ శిశువుకు కూడా బోధన ప్రారంభం చేసే ప్రణాళికలు తెచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. దీని వల్ల ఇంకా ఆదాయం పెరుగుతుంది. ఈ ఆగడాలు అరికట్టడానికి ప్రభుత్వం కఠినమైన నిఘా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ విద్యాసంస్థలు పుంజు కోవడానికి తీవ్రమైన కృషి చేయాలి. అప్పుడే అభివృద్ధిని ఆశించవచ్చును. 'ఆచార్యదేవో భవ' అన్న గౌరవ మంత్రాన్ని నిలబెట్టుకొనవలసిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుని మీద వున్నదనీ తద్వారా ఉన్నత ప్రమాణాలు గల విద్యనూ, గత వైభవాన్ని ఆశిద్దాం.



**– మాయకుంట్ల నారాయణరెడ్డి**
9989686603

## ఆగకు ! ఆపకు ! మానకు !

ఓ మిత్రమా!
గమ్యం సుదూరమని
చేరలేనేమోనని
పరుగు మాత్రం ఆపకు...
నీళ్లు పడలేదని
బావిని త్రవ్వడం ఆపకు...
పీడకలలు వస్తున్నాయని
కలలుకనడం ఆపకు...
పరీక్షలు పాస్ కాలేదని
చదవడం మానకు...
ఉద్యోగం రాలేదని
ఇంటర్వ్యూస్ కెళ్లడం మానకు...
పూజారి ప్రసాదం పెట్టలేదని
గుడికెళ్లడం మానకు...
పాడిగేదె పాలివ్వడం లేదని
మేత వేయడం మానకు...
ఓ మిత్రమా! ఒక్కవిషయం
మాత్రం ప్రతినిత్యం గుర్తుచేసుకో!
నేడు ఆటలో గెలిచినవాళ్లంతా
ఒక రోజు ఓడినవాళ్ళేనని...
నేడు పరిగెత్తేవాళ్ళంతా
ఒకనాడు పడి లేచినవాళ్ళేనని...
అందుకే ఓ మిత్రమా!
ఈరోజు కాకున్నా రేపైనా
ఇప్పుడు కాకున్నా
మరెప్పుడైనా ఏనాడైనా
నీ శ్రమకు ఫలితందక్కేరోజు
ఉందన్న దగ్గరలోనే ఉందన్న
నీ అపజయాలన్నీ విజయాలుగా
మారే ఒక మంచిశుభదినం
నీ ముందరే...ఒకేఒక్క అడుగు
దూరంలో ఉందన్న
ఓ నగ్నసత్యం తెలుసుకో !
నిట్టూర్చకు.!..నిరాశ చెందకు !
వెరవకు ! వెనుతిరగకు.!
కానీ ఆ ఒక్క అడుగు ముందుకు
వెయ్యడం మాత్రం...మరువకు !



**–పోలయ్య కవి కూకట్లపల్లి**
9110784502

## రక్షాబంధనం..

చిన్ననాటి మమత చిలిపి ముచ్చట్లను
తెలిపి ప్రేమ పంచు తీయ గాను
కన్న తల్లి వోలె కాపాడు నెప్పుడు
భాధ్యతెరిగి మసలు బందమిదియె.!

శుభము నిచ్చు రక్ష శోభను పెంచగా
అద్భుతంబు గాను యవని యందు
వెలిసె శ్రావణమున వేడుకలే చేయ
మమత తెలుప వచ్చె మధురముగను.!

అంతులేని ప్రేమ ఆత్మీయతను పంచు
రక్షాబంధనమున రాఖి కట్ట
తలచె ప్రేమ తోడ :తరలెగ సోదరి
మమత పెంచు చెలిమి మహిన మిన్న.!

నష్ట పరచడెపుడు నాన్నలా కాచును
ప్రేమ పంచి యిచ్చి పెన్నిదౌను
ధరణి యందు మనకు దైవమై వెలియగ
మంచి చెడు తెలుపు మధురముగను.!

మనసు విప్పి చెప్పు మంచి నేస్తము గాను
నిలిచియుండు నెపుడు నీడ లాగ
చేయి పట్టి నడుపు చెలిమి తోడ
తెలియ జెప్పు నీతి తీరు గాను ..!

రాఖి పర్వమొచ్చె రక్షనిచ్చు మనకి
అన్న చెల్లి మమత యందముగను
అవని లోన నిలుచు యపురూపమైందిగా
సర్వ జనులు మెచ్చ చక్క గాను..!



**–సునీత బండారు**
9440671530

## అన్నాచెల్లెళ్లు...

అపురూపమైన ప్రేమకు
అన్ననే ప్రతిరూపము
అమితమైన ప్రేమకు
చెల్లెలే నిదర్శనము !

అన్న చెంతఉంటే
ఎంతో ధైర్యము
చెల్లి తోడుంటే
ఎంతో సంతోషము !

అన్న ఆశలన్నీ
చెల్లెలు బాగుకొరకే
చెల్లెలు సంతోషాలన్నీ
అన్న ఆనందంకొరకే !

అన్నంటే ఆప్యాయత
చెల్లంటే అనురాగం
అన్నంటే బాధ్యత
చెల్లంటే మమకారం !

సరదాగా కొట్లాడినా
సంతోషాన్ని కోరుకుంటాడు
తెలియక దెబ్బలాడినా
సారీయని బతిమిలాడుతాడు !

చెల్లెళ్ళంటే అన్నకు
అపురూపమైన వాత్సల్యము
అన్నంటే చెల్లెళ్లకు
అమితమైన భక్తి భావము !

ప్రేమానురాగాలకు సూచకంగా
రాఖీలను కట్టుకుంటారు
భారతదేశంలో వైభవంగా
పండుగ జరుపుకుంటారు !

శ్రావణ మాసంలో
రక్షాబంధన్ వస్తుంది
అందరి మనసులో
ఆనందాన్ని తెస్తుంది !

జీవితంలో భయపడితే
రాఖీ ఓదార్పునిస్తుంది
నిస్సహాయతకు గురయితే
రాఖీ ఉత్సాహాన్నిస్తుంది !

తలపెట్టిన కార్యక్రమము
విజయవంతమవుతుంది
సోదరీసోదరుల బంధము
బలోపేతమవుతుంది !

సుఖసంతోషాలు కలగడానికి
మనస్ఫూర్తిగా సహకరిస్తారు
మానమర్యాదలు నిలపడానికి
బాసటగా నిలుస్తారు !

నూతన వస్త్రాలను
కానుకగా ఇస్తారు
చిరు కానుకలను
ఇచ్చిపుచ్చుకుంటారు !

అడుగు బయటపెడితే
దేగకన్నై కాపాడుతాడు
మనసు బాధపడితే
అచ్చిబుచ్చితో నవ్విస్తాడు !

కంటికి కనుపాపలా
నిత్యం కాపాడుతాడు
కమ్మనైన జోలపాటలా
నిదూర పుచ్చుతాడు !

అనురాగాలను ముడివేసి
ఆనందంగా జతకడతారు
ఈర్ష్యాద్వేషాలకు అడ్డుకట్టవేసి
మమకారపుజల్లు కురిపిస్తారు !

బంధాల పూదోటలో
ప్రేమనుకురిపించే కుసుమాలు
అనుబంధాల వాకిటిలో
మనసుదోచే రంగవల్లికలు !

పండుగ పబ్బాలకు
కోరింది తెస్తాడు
చెల్లెళ్ల అవసరాలకు
ఏటీఎం కార్డుఇస్తాడు !

పండుగ జరుపుకోవాలంటే
సంస్కృతి బలపడాలి
బంధాలు వికసించాలంటే
అభిప్రాయాలు సమకూరాలి !

మానవ సంబంధాలకు
ఆర్థికమూలాలు ఎందుకు
అన్నాచెల్లెళ్ల బంధాలకు
ప్రేమానురాగాలే ముందుకు !

రాఖీ పండుగనాడు
ఇంటింటా ఆనందము
శ్రావణ పౌర్ణమినాడు
కుటుంబమంతా సంబురము !

తోబుట్టువుకు తోడుగా
నిలిచే పర్వదినం
అనుదినం అండగా
నిలిపే సుదినం !

చెల్లెలు బాధపడితే
అన్నకళ్ళల్లో కన్నీరొస్తుంది
అన్న దిగులుపడితే
చెల్లెలు రోదిస్తుంది !

కాలం పరిగిడినా
ప్రేమలు పదిలమవుతాయి
కాలగమనంలో కలిసినా
బంధాలు పటిష్టమవుతాయి!



**– రవి చంచల**
8500330700

## స్నేహ రేఖ

అలుపు తలపుకు తలుపు తెరవనివ్వని – తన్మయ రేఖ – నీ స్నేహ రేఖ
అరక్షణం కూడా – ఆదమరపు లేని క్రమశిక్షణ రేఖ – నీ స్నేహ రేఖ
అనవరతం – నీకు నేనున్నాను అని విశ్వాసాన్ని నింపే శ్వాసరేఖ – నీ స్నేహ రేఖ
అనూహ్యమైన ఉపకారాన్నందించే – ధ్యాస రేఖ – నీ స్నేహ రేఖ

అణువంత కూడా ఈసులేని మనసుకు – సౌభాగ్యరేఖ – నీ స్నేహ రేఖ
అందుకే – అనుక్షణం నీతోనే మాట్లాడాలనిపించే మనోహర రేఖ – నీ స్నేహ రేఖ
అనాథను కూడా అక్కున చేర్చి చేరదీసే – దివ్య రేఖ – నీ స్నేహ రేఖ
అనుబంధపు ఆత్మీయ సన్నిధికి – అక్షరీకరణకు అందని భావనరేఖ–నీ స్నేహ రేఖ

అనుక్షణం – పరోపకారాన్నందించే నిధికి – అమృత రేఖ – నీ స్నేహ రేఖ
అనుమానాలనే అడుగిడనివ్వని సన్నిధికి – సౌగంధిక రేఖ – నీ స్నేహ రేఖ
అదే పనిగా–పదే–పదే–సాయమందించే పెన్నిధికి ~ పత్రహరిత రేఖ–స్నేహ రేఖ
అమూల్యమైన – సర్వసవ్వడిలోనే

"నీ వుంటే వేరే కనులెందుకు
నీకంటే వేరే బ్రతుకెందుకు – అని
పలకరింపులోనే – పారవశ్యపు –
పులకరింపును – ప్రసాదించే –
తూరుపు సింధుర రేఖ – "నీ స్నేహ రేఖ"



**–లంకా వెంకట సుబ్రహ్మణ్యం**
సెల్: 94404 48650

## ఎదకోయిలవై...

ఓ నాలుగు మనసైన వాక్యాలు విని
మైమరచిపోయే దారిలో తచ్చాడి
మనసును అప్పనంగా పారేసుకుని
కాయంపై మాయ పొరలను కమ్మేసుకుని
ఉల్లాసవీధిలో నే ఊరేగలేను

పెదవంచు పలుకులతోనే మురిసి
నరాలలో నయా స్వరాలను మీటుకుని
నయవంచనా గీతికలను పాడలేను
పాలపొంగులా అశాశ్వతత్వాన్ని చూపి
తేటపాటల ఊటలో ఈదులాడనూలేను

తపాలు చేసి వరాలు పొందిన
ప్రేమతపోయోగిని కానేకాను
నిజాల నీడను వీడి
పొగడ్తల అగడ్తలలో మునకలేసి
కాలాన్ని కరగదీసుకుని
కలల అలలపైనా తేలిపోనూలేను

నయగారాల నగిషీలు చెక్కుకుని
అత్మన్యూనతా భావాలు కప్పుకుని
అదనుకొరకై ఆశగా చూసి
ఆనందాలను దిగమింగే
నయవంచనా రూపునదుముకోలేను

నా మనోభారాలను దూరంచేసి
సంతోషసాగరాలలో సంగమించి
మమతల సరాగాల తోటలో
మధుమాసగీతిలా ఎదకోయిలవై
పల్లవించిన చాలు.. నా గొంతులో...



-శ్రీదాస్యం లక్ష్మయ్య
9440155240

# రాజ్యశ్రీ మెరిపించిన మెరుపులు






సముద్ర మథనం లోంచి అమృతం పుట్టినట్లు "మేధో మథనంలోంచి కవిత్వం, సృజనలోంచే ఆలోచనామృతం వెలువడుతుందని విశ్వసించే డా॥ కేతవరపు రాజ్యశ్రీ లఘురూపకవిత్వంలో కొన్ని మెరుపులు మెరిపించింది.

"సముద్రపు అల–కాళ్లను ముద్దాడితే ఆనందం – కాళ్లను గుంజితే విషాదం".

సముద్రపు అందాలను తిలకించడానికి వెళ్తాం. ఎగసిపడే అలలను చూసి ఆనందిస్తాం. ఆ అలలు కాళ్లను తాకి వెళ్తే పరవశిస్తాం. అవే అలలు కాళ్లను గుంజి సముద్రంలోకి ఈడ్చుకుపోతే విహార యాత్ర – అవుతుంది విషాదాంతం.

"కంటినుండి జారిన ఒక్క కన్నీటి బొట్టు / బరువెక్కిన గుండెకు గొప్ప సాంత్వన".

సంతోషం కలిగినప్పుడు గలగలా నవ్వాలి. దుఃఖం వచ్చినప్పుడు వలవలా ఏడ్వాలి. వాన కురిసిన తర్వాత ఎండకాస్తే ఆనందం కలిగినట్లు, కన్నీరు కార్చిన తర్వాత మనసు తేలికవుతుంది. గొప్ప ఓదార్పు లభిస్తుంది.

"పొద్దు పొడుపుతో నిదుర లేచిన అమ్మ / భానుడితో పరుగు పందెం / మధ్యాహ్నానికి సూర్యుడు చండ ప్రచండం / అమ్మ వడలిన కుసుమం". అలుపెరుగని అమ్మ శ్రమ, త్యాగం ఈ కవితలలో అగుపిస్తాయి.

"పగలంతా మథనపడినా / చిక్కని భావజాలం / అర్ధరాత్రి తట్టి లేపుతుంది / రాయమని కవిత్వం."

ఒకోసారి కవిత్వం రాయాలని కలంపట్టి ఎంత ఆలోచించినా రాని భావం – మరోసారి అర్ధరాత్రి వచ్చి తట్టి లేపుతుంది. కవిత్వం రాసేవాళ్లు అనుభవిస్తున్న దానిని కవిత్వంలోనే చెప్పింది కవయిత్రి.

"వంటగదిలో భార్య – ముందుహాల్లో భర్త – స్టడీరూంలో పిల్లలు – సెల్‌ఫోన్ వలయంలో ప్రపంచం".

సెల్‌ఫోన్ మన జీవితాలలో అనూహ్యమైన మార్పులు తెచ్చింది. సౌకర్యాలను కలిగిస్తున్నది. అనుబంధాలను దూరం చేస్తున్నది. 'మార్నింగ్ కాఫీతో పలకరించే వైఫ్‌కు లేదు లైక్ – గుడ్ మార్నింగ్ మెసేజ్‌లకు ఎక్కడలేని హుషారు.'

టీవీ విషయానికి వస్తే – భర్త న్యూస్ చానల్, భార్య వనితా చానల్, అవ్వ భక్తి చానల్, పిల్లలు కార్టూన్ చానల్ – కుటుంబమే చానలైజ్ అయిందని, ఇక టీవీలో వచ్చే కామెడీ షో నటుల చిల్లర చేష్టలతో, న్యాయనిర్ణేతల వెకిలి నవ్వులతో – సభ్యతా సంస్కారాలకే తలకొట్టేసినట్లవుతుందని అంటుంది రాజ్యశ్రీ. ఇంటర్నెట్ కాగితాన్ని, సెల్‌ఫోన్ మానవ సంబంధాలనూ, వార్తాపత్రిక నిజాయితీని మింగేశాయని, టెక్నాలజీ మనశ్శాంతిని దహించిందని ఆమె అభిప్రాయం.

కొడుకులు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లతో ఇల్లంతా సందడే. 'సమూహంలో ఉన్నా ఒంటరిది వృద్ధాప్యం.' ఎవరి అవసరాలు వారివే. ఎవరిగోల వారిదే. తమను పెంచి పెద్దచేసి, తమ బతుకు కొక స్థిరత్వాన్ని కల్పించిన వృద్ధులను పట్టించుకునే వారే లేరని కవయిత్రి ఆవేదన. "పిల్లలు శిశువిహార్లకు – పెద్దలు వృద్ధాశ్రమాలకు – భార్యాభర్తలు ఉద్యోగాలకు". ఇది కొన్ని ఇళ్లల్లో కనిపిస్తున్న దృశ్యం. పూర్వపు అనుబంధాలు అదృశ్యం.

"అపర ధన్వంతరీలు / సంస్కృతీ సంప్రదాయాల పట్టుగొమ్మలు / మన బామ్మలు / వృద్ధాశ్రమాల పాలు"

వంటింటి దినుసులతో వ్యాధులను పోగొట్టే, సంస్కృతి సంప్రదాయాలను నిలబెట్టే బామ్మల విలువ తెలుసుకోలేని అజ్ఞానులు వృద్ధాశ్రమాలకు పంపిస్తున్నారు.

"కళ్లజోడు కిందపడి పగిలింది". మూలన కూచునేవాడికి కళ్లజోడెందుకు ? అని తన వాళ్లే అంటే "ముసలాయన గుండె కూడ పగిలింది." అని హృదయవిదారకంగా చెబుతుంది రాజ్యశ్రీ.

ఇంకా – భార్యాభర్తల మధ్య అవగాహన తక్కువౌతున్నదని, అందరికీ బి.పి., షుగర్లు ఆభరణాలౌతున్నాయని, డాక్టర్లు రోగులను కాసులపంటగా చూస్తున్నారని, దేశాన్ని కాదని విదేశాలకు ఎగుమతి వెళ్లింది మొదలు దేశీయ సరుకు దిగుమతి చేసుకుంటున్నారని వాస్తవాలను కొన్ని కవితలలో పేర్కొంటుంది.

ఒక కవితలో – వరల్డ్ కప్ క్రికెట్ మైదానంలో స్టెప్పులు వేస్తూ, కేరింతలు కొడుతూ ముందుకొస్తుందో బామ్మ. "ముఖ్యం కాదు వయసు – ఆనందించేది మనసు." 'మాకు చేతకాదు' అని నిర్వీర్యంగా, నిస్తేజంగా ఉండే వాళ్లంతా ఆ బామ్మను చూసి హుషారు తెచ్చుకోవాలి. "కొందరు నడిచి వెళ్లిన దారి / గడిపిన కాలం ఎంతో స్ఫూర్తిమంతం / మహాత్ముల మాట ప్రగతి మంత్రం."

మహాత్ముల బాటలో నడవాలి. మానవత్వం ఉన్న మనుషులుగా మనం బ్రతకాలి.

కేతవరపు రాజ్యశ్రీ 'మెరుపులు' కొన్ని మెరుస్తున్నాయి. మరికొన్ని – ఇంకా కవిత్వంలో సాధన చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. పాఠకుల హృదయాలను వెలిగించే మరింత చక్కని, చిక్కని కవిత్వం రాయాలని కోరుతూ – ఆమెకు అభినందనలు.

ప్రతులకు: కె. రాజ్యశ్రీ
ప్లాట్‌నెం. 301, గోకుల్ అపార్ట్‌మెంట్స్
స్ట్రీట్ నెం. 4, అశోక్‌నగర్,
హైదరాబాద్–500 020
సెల్: 85001 21990



-ఎ. గజేందర్‌రెడ్డి
సెల్ : 9848894086

## ప్రకృతిని ఎదలో కొలవాలి

నరుడి అహంకారం అందలమెక్కి
స్వార్థ మబ్బులు కమ్ముకొని
విషపు జల్లులు కురుస్తూ
పరిహారపు ప్రవాహాల మడులు నిండుతున్నాయి

పుడమి తనవు నంతా ఖనిజాల సిరుల
పేరుతో కోట్లు దండుకుంటూ కుబేరులై
విలాసాల ఊయలలో ఊరేగుతుంటే
గూడు చెదిరిన ఆదివాసీల
గుండె రోదనలు వింటుంటే
ప్రకృతి తనువంత కన్నీటి సాగరమైతాంది

అవని తనువు మీద తరువులన్నీ తరిగి
భూమి భూషణలను బుగ్గి పాల్జేస్తూ
ప్రగతి పేరుతోనరుడు పరుగులుపెడుతూ
పశుపక్ష్యాదులకు ఆవాసం కరువై
పుడమి గుండె చెరువై
దిగులు పక్షిలా దిగాలుగా చూస్తుంది

నరుడి నకరాలకు విసుగు చెంది
తన అమ్ములపొదిలో నుండి
నరుడి పై కరోనా పంజాను విసిరితే
శిరస్సు తెగిన కోడి లా
మానవుడు విలవిల్లాడుతున్నాడు

నరుడా ప్రకృతిని యాది మరిస్తే
ప్రళయాలు తప్పవు గుర్తుంచుకో
ప్రకృతి పై కటువుగా ఉంటే
కాలనాగై కాటేస్తది
ప్రకృతి పై కనికరం చూపిస్తే
కనక వర్షం కురిపిస్తది .



-తాటిపాముల రమేష్
7981566031

## కవనరంగ కత్తులం

మనమంతా సోదరులం
మనం ఆత్మీయులం
పాళీ లోంచి పారుతున్న
ప్రాణమున్న చుక్కలం..! ॥మనమంతా॥
చెట్టుకొమ్మలిరిగినా
పట్టువిడని పక్షులం
లెక్కలేని తేడాలున్నా
ఒక్కగూటి గువ్వలం..! ॥మనమంతా॥
ఎవ్వరికేమైన గాని
వెంటనె స్పందించగలం
తనువులు వేరైన గాని
తల్లడిల్లి పోగలం..! ॥మనమంతా॥
సోదరీ సోదరులం
సొంతమైన మనుషులం
కల్లకపటమెరుగనీ
కవనరంగ కత్తులం..! ॥మనమంతా॥

పఠనమే పవిత్రం
భాషణమే భూషణం
శ్రవణమే సహనమూ
రచనయే అంతిమం..! ॥మనమంతా ॥
మంచినే మెచ్చెదం
చెడును చెండాడెదం
లోకహితం కోరెదం
మహాకవుల వారసులం..! ॥మనమంతా



- పెసరు లింగారెడ్డి
9010292500

పుస్తక సమీక్షలు

# ప్రేమికుల హృదయాలను కదిలించే కవితాస్త్రాలు






పేదవాడి చేతిలో పెన్ను కవితా సంపుటితో సాహితీ క్షేత్రంలో అడుగిడిన దూడపాక శ్రీధర్ (సకల అంశాలను అలవోకగా రాసే గన్ను) కలం నుండి జాలువారిన భావ కవిత్వమే ఈ మౌనాక్షరాలు. వేదనలో అక్షరాలను అలుముకొని,సమాజంలోని వెతలను, రైతుల దీనగాథలను,స్త్రీల బాధాపరితప్త హృదయాలను ఆవిష్కరించిన కవి హృదయం ఇపుడు భావనాలోకంలో విహరిస్తూ నదిలా తన మనసులోని ఉప్పొంగుతున్న భావఝరిని "మౌనాక్షరాలు" గా ప్రకటించాడు.

ప్రతి మగవాడి అభివృద్ధి వెనుక ఒక స్త్రీ ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. "నా జీవితంలో వెన్నెలై వచ్చి,నా అంతరంగాన్ని అర్థం చేసుకొని మోడువారిన నా జీవితాన్ని చిగురింపజేసిన నా అర్ధాంగికి కవితాసంపుటితో పాటు నా జీవితాన్ని మౌనంగా అంకితమిస్తున్నా"నంటూ పొందు పరచిన మాటలు భార్యగా తన భాధ్యతను సమర్థవంతంగా నిర్వహించిందనటానికి ప్రతీకలుగా నిలుస్తాయి.

సాధారణంగా కన్నులను కలువ పూలతో పోలుస్తారు.కానీ తెల్లవారాక వాడిపోయే కలువపూలతో నేను పోల్చలేనని చెప్పడం ఓ ప్రత్యేకత

"ఊపిరివై అనుక్షణం
నాలోన కదలాడుతూ
నా ఊహను నీవైపు
లాగేస్తావు ఎందుకు" అంటూ తన మదిలోని మధురోహల భావాలను "నా హృదయ వేదన"లో చక్కగా ఆవిష్కరించారు."ఎవరు నువ్వు ఎవరు నేను" కవితలో తనహృదయేశ్వరిని
"నా ఊహల్లో నాట్యమాడుతూ/
నా ఊపిరిగా మారి/
కనుచూపు మేరలో కనిపించి కవ్విస్తున్నావు" అంటూ జ్ఞాపకాలతడిని ప్రకటించారు.

"నల్లని అక్షరాలతో /
విధి రాసిన /
తెల్ల కాగితం నా ఊహ" అంటు అందమైన ఊహను భావాత్మకమైన అక్షరాలతో అలంకరించడం బాగుంది. తనను వీడిపోవడం న్యాయమా అంటూ పలు కవితలలో తన విరహ వేదనను ప్రకటించిన వైనం,నీ ధ్యాసలో నేను జీవిస్తానని ,మీ కోసమే నేనని ప్రకటించడం శ్రీధర్ లోని ప్రేమికుడు దర్శనమిస్తాడు.

"నీ జ్ఞాపకాల కుసుమాలు" "మదిలో అలజడి"చేసి "చిగురాశల నావ"లా "నిశీధిలో చిరు దీపంలా" "ఊగిసలాడే నా హృదయం" "ప్రతి క్షణం పరవశం" చెందుతూ "కన్నుల కవ్వింతలు" "కదిలిపోయే కాలం "లో "నిన్ను చూడాలని" "ఎదురు చూసే కనులు" "మదనపడే హృదయం" "తన్మయత్వం"లో నా మది గీసిన చిత్రం" లా తీపి జ్ఞాపకమై నిలిచింది

ఒకవైపు సౌదర్యారాధనతో స్త్రీని ఆరాధిస్తూ కవితలల్లిన కలం,మోసం చేసిన వనితను,ప్రేమలో మోసపోయిన ప్రేమికుని బాధను కూడా స్పృషించడం వాస్తవిక పరిస్థితులకు అద్దం పట్టింది. అదే విషయాన్ని కలత చెందిన హృదయంలో కవిత్వీకరిస్తూ

"భారమైన బ్రతుకు బ్రతకలేని / తనువు చచ్చిపోమంటుంద"ని భగ్న ప్రేమికుని అంతరంగాన్ని ఆవిష్కరించాడు కవి.

"కోపాలు తాపాలు క్షణకాలపు తెమ్మెరలు
ఓర్పు సహనంతో ఒద్దికగా మెదిలినపుడు
నీ లోని తప్పులన్నీ నే ఉలితో చెక్కినపుడు
సరాగాల సంసారం సంగీతమై పోతుంది" అంటూ సంసారంలోని సారాన్ని చక్కగా విశదపరచడం సంసారం పట్ల కవికి గల అవగాహనను తెలియజేస్తుంది.

కవి రాసిన కవితలన్నీ అనుభవంతో అనుభూతితో రాసినట్లుగా మనం గమనించవచ్చు. కవి ఊహించి రాసిన కవిత్వంలో ఆర్ద్రత ఉండదు. సజీవత్వం కనిపించదు. కృతకంగా వినిపిస్తుంది. ఏదేమైన శ్రీధర్ మౌనాక్షరాలు ప్రేమికుల మనసులను మౌనంగా కదిలిస్తాయనడంలో సందేహమేమి లేదు.

ప్రతులకు: దూడపాక శ్రీధర్
గ్రా॥ కూచిరాజ్‌పల్లి
మం॥ మంథని, జి॥ పెద్దపల్లి
పిన్– 505 184
సెల్: 9666375277



- డా వైరాగ్యం ప్రభాకర్
-9014559059

## ఋతు రాగాలకు స్వాగతం..!

గడిచిపోయిన కాలం
జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ
ఏవేవో ఆలోచనలతో
ఋతువు ఆగమనానికి
స్వాగతం చెబుతోంది..!

మట్టి మనిషికి వాగ్దానం చేస్తూ
కలల ప్రపంచానికి
రంగుల హంగులు అందివ్వడానికి
ఋతువై విచ్చుకుంటుంది..!

తండ్రిలా ఆకాశం
బాధ్యతను పోషించే పనిలో
నిమగ్నమవుతుంది..!

అమ్మ ప్రేమకు
మేఘాలు కరిగి
సంతోషాల వర్షంగా కురిపిస్తున్నాయి..!

చినుకులు
హృదయపు చూపులతో
ఊచలు పసిగడుతూ
గంతులేస్తున్నవి..!

బోసినవ్వులు
చిందిస్తూ చిన్నారులు
గుండ్రటి భూగోళాన్ని
బంతిలా ఆడుతున్నారు.!

గాలి కొత్త ఆశలతో
రెక్కలను తొడుగుతోంది.!

కాలువలు పాతకాలపు
ప్రాణ స్నేహితులతో
ముచ్చటిస్తున్నవి...!

కొత్త వరదలతో
చెరువులు హాయిగా ఇప్పుడిప్పుడే
ప్రాణం పోసుకుంటున్నవి..!

పక్షిలు
నిన్న మొన్నటి ఆనవాళ్లను
ఆరవేసుకుంటున్నవి..!

జంతువులు
మునుపటి జ్ఞాపకాల
అన్యోన్యతతో ముచ్చటిస్తున్నవి..!

ఊహల లోకానికి
ఊసుల ఊపిరి అద్దుతూ
ఆశల సోయగాలు
భువిపై చొరబడుతున్నవి..!

చెట్ల ఆకులు
అభ్యంగన స్నానమాడి
వసంత సమీరానికి
కురులు ఆరబోస్తూ..
ఋతు రాగానికి
తరువుల కొమ్మలు పులకింతలతో
ఆహ్వానం పలుకుతున్నవి ఋతువులకి..!



-కొలిపాక శ్రీనివాస్
9866514972

## మెరుపులు

డబ్బు ఉన్నవాడు..
గర్వంగా వుండును..
జబ్బులు వచ్చినప్పుడు..
భయంతో వణుకును..

కష్టపడి పోగేస్తే..
విలువెంటో తెలుసును..
దోచుకొని దాసేస్తే..
విలువెందుకు తెలుసును..

గర్వం తలకెక్కితే..
బతుకు పొగసూరును..
ప్రేమ చూపించితే..
పది కాలాలుండును..

ఆస్తి ఉన్నదని..
తక్కువ చేయకుము..
అంతా ఒక్కటేనని..
భావన కల్గుండుము..

డబ్బు తోడ..
అంతస్తు లెక్కేయకుము..
ప్రేమ తోడ..
విలువ కట్టుము..

ధనదాహం కల్గినోడు..
దోచుకొనుటకు చూసును..
నిజాయితీ వున్నోడు..
మార్పు కోరుకొనును..

పైకాన్ని బట్టి..
సోపతి చేయకుము..
మనిషిని బట్టి..
మాట మార్చకుము..

పేదోడు ఎప్పుడు..
పూటకోసం చూసును..
ఉన్నోడు ఎప్పుడు..
దోచుకొనీకి పరుగెత్తును..

ఎంత సంపాదిచినా..
ముప్పొద్దుల తిండికే..
ఎంత పోగేసినా..
మూడుజాన్ల పొట్టకే..

డబ్బుతో పాటు..
ప్రేమను పంచు..
తప్పిన రూటు..
సాయానికి ఉపయోగించు..



-పసుల. శంకర్
9542181301

## హైకూలు

తారల సైన్యంతో
నిశిపై దండెత్తిన
రేరాజు

ప్రయాణం
ముగిసింది
తీరం చేరిన అల

కాలానికి
ఒకే పని
పొద్దెనక నడుచుడు

పర్వత రాజుకు
వింజామరలు
గాలికూగే చెట్లు

వామనుడు
బలిపై కాలు మోపినట్టు
మర్రిపై తాటి చెట్టు

వరిచేలపై
రంగుల రిబ్బెన
హరివిల్లు

అన్నదమ్ముల
దాగుడు మూతలాట
పగలు రేయి

చేతుల్ని అల్లుకున్న
ఇంద్రధనుస్సు
ఫ్రెండ్‌షిప్ బ్యాండ్



-దమరకుంట శంకరయ్య
9440876788

## పొత్తు

నిన్న
కుదిరింది!
నేడు
చెదిరింది!
ప్రజాస్వామ్యం
బెదిరింది!

## అనంత వేదన

ఆకాశం అరువు
వెన్నెల దిగులు
భేమి ఏడుపు
మనిషి ఎక్కడ అనేది
వాటి బాధ!

- నర్రా ప్రభావతి
7989559279

## ముంజనీరు!



ఆకాశ మంతటి
తాటి చెట్టును
ఓ అమ్మలా నమ్ముకున్న
మట్టి చేతుల మానాన్నా..
వెట్టి చేసి మిగిలిందేమిలేక
కష్టాల కన్నీళ్ళ తోటి
కడుపునింపుకొని
తన వాళ్ళ కళ్ళలో
ఆనందం కోసం
తపన చెందిన నాన్నా
పుట్టిన నీ చెమట చుక్కలు
తొట్టిలో నిండుకున్న వేళ
నీ రాక కోసం ఎదురుచూసిన
అమ్మ గుండెల్లో సజీవమైన
ఆశలెన్నెన్నో..
క్షణం ఒక యుగంలా
బతుకు కోసం సాగే
గమనంలో
పొంచియున్న
మృత్యువు నెదిరించి
ముప్పూటలా నువ్వు
మృత్యుంజయునిలా
తిరిగొస్తున్నప్పుడు
ముంత చేత పట్టిన అమ్మ
ఎందరి కడుపులు నింపింది
నేడెందుకమ్మ శోక సముద్రమైంది?
గాయాలు గుండె చప్పుళ్ళై
అక్షర రూపం దాలుస్తానంటే
మరి ఎవ్వరి గూర్చి రాస్తాయి
నాన్నా..
గీత కార్మికుడివై నీవు నేర్పించిన
గీతలు
గడుపు నింపడమే తెల్సుగాని
కడుపు కొట్టడం తెల్వదని
అమ్మ నుండి నేర్చిన పాఠాలు
మహోన్నతమైనవి కాకున్నా సరే
నా జాతి మేలు కోసం
జన్మనిచ్చిన ఈ తల్లి భూమి
నీ రుణం తీర్చ
వెలుతురు విత్తనాల
అక్షరాలు నా కందించిన నాన్నా..
ఇంకేమి కావాలి
నీ నుండి ఆశించ
నాకిచ్చిన వరాలు
ఈ అక్షరాలు
నవసమాజపు స్వాగత
గీతికలల్లేటందుకు
సిద్ధమవుతూనే వుంటాయి
నాన్న..
నవ వసంతపు
సందడి కోసం
ఆరాటపడుతూ..
మరి
మోకుముస్తాదు
అడుగుతున్నాయి
సానరాయి పలుకాగి
సిన్నబోయింది
యాదికొస్తే యేడ్పెందుకంటూ
సొమ్మసిల్లిన వేళ
ముంజనీరు చినుకులై
మేల్కొల్పుతావా నాన్నా..
నింగిని తాకే తాటిచెట్టు
నిన్నడిగింది
ఏమని చెప్పను?
నీలోనే ముంజనీరై
దాగున్నాడని
చెప్పనా!?

-పలస. అనంత్

## జన్మజన్మల అనురాగబంధం..!

ఉవ్వెత్తున ఎగసే అలలు సైతం
తీరాన్ని తాకిన మరుక్షణం లోనే
సముద్రంలో కలిసిపోయినట్లుగా
ఒకర్ని విడిచి మరొకరు ఉండలేని
స్థితికి చేరుకున్న నిత్య ప్రేమికులై
అనుబంధానికి అసలైన రూపమై
భార్యాభర్తల దృఢమైన బంధానికి
స్ఫూర్తిదాయకమై నిలిచారు వాళ్ళు..!

వెలుగునీడలు సహజమైనట్లుగానే
సుఖదుఃఖాలు అనివార్యమైనట్లుగానే
కలిమి లేమి తప్పించుకోలేనివైనట్లుగానే
తట్టుకోలేని ఆపదలెన్ని ఎదురైనా కానీ
చెక్కుచెదరని జీవన ఆకాంక్షలతో
విడిచిపెట్టలేని మమతానురాగాలతో
నడయాడుతున్న అచ్చమైన చిరునామకు
ఆనవాళ్ళుగా వెలుగొందుతుంటారు వాళ్ళు..!

దేహాలు రెండైనా ఒకే ఆత్మైనట్లుగా
నేత్రాలు నాలుగైన ఒకే దృశ్యమైనట్లుగా
పాదాలు నాలుగైన దారొకటైనట్లుగా
పెదాలు నాలుగైన వాక్కు ఒకటైనట్లుగా
జీవన సమరంలో అవిశ్రాంత యోధులైనట్లుగా
ఒకరిలో ఒకరుగా అల్లుకపోయిన తీగలైనట్లుగా
నేలపైన వికసించే పూలవనమైనట్లుగా
జన్మజన్మల అనురాగబంధానికి ప్రతీక వాళ్ళు..!



-గోపగాని రవీందర్
9440979882

## అమాయకపు గుట్టన్న కథలు (పిల్లల హాస్య కథలు)

# కూరగాయల ఎంపిక

కూరగాయల మార్కెట్ కు వెళ్లిన గుట్టడు అక్కడి కూరగాయలను పరిశీలించాడు .అక్కడ ఒక పెద్దమనిషి బెండకాయలను చివర విరుస్తూ త్రాసులో వేస్తున్నాడు.

గుట్టడు ఆయన వద్దకు వెళ్లి" ఏమిటండి! బెండకాయలను అలా చివర విరిచి వేస్తున్నారు" అని అడిగాడు .ఆ పెద్దమనిషి బదులిస్తూ" అలా కాయ చివరలు చటుక్కున విరిగితే అది లేత కాయ అని అర్థం" అని తెలియజేశాడు." ఓహో కూరగాయలు అన్నీ ఇలా విరవాలి కాబోలు" అనుకొని గుట్టడు బీరకాయలు అమ్మే స్త్రీ వద్దకు వెళ్లి బీరకాయలను విరిచి త్రాసులో వేయసాగాడు .అది చూసిన ఆమెకు కోపం వచ్చింది."ఎందుకు నా బీరకాయలు అలా విరిచి వేస్తున్నావు"అని ఆమె కోపంగా ప్రశ్నించింది. "అవి లేతవా ! కావా !అని నాకు తెలియాలి కదా "అని అన్నాడు గుట్టడు. ఆమె కోప్పడుతూ "నీవు తీసుకోకు! వెళ్లి రా!" అని కోపంతో అంది . గుట్టడు విరిచిన ఆ బీరకాయలను ఆమె వేరే బుట్టలో వేసి వాడిని నానా తిట్లను తిట్టింది . గుట్టడు కూడా ఆమెను నానా మాటలు అన్నాడు .చివరకు ఆ పెద్ద మనిషి చూసి

" ఒరేయ్! బీరకాయలను అలా విరవకూడదు. కేవలం బెండకాయలను మాత్రమే అలా విరవాలి" అనేసరికి గుట్టడు అమాయకంగా" అలాగాండీ"అని అన్నాడు.

వాడు వంకాయలను అమ్మే స్త్రీ వద్దకు వెళ్ళాడు. ఆమె పుచ్చు వంకాయలను వేరుగా పెడుతున్నది. వాటికి చాలా తక్కువ ధర చెప్పింది .వాడు ఆ పుచ్చు వంకాయలను తక్కువ ధర అని కొన్నాడు ."ఆ పుచ్చు వంకాయలలో ఏముంటుంది" అని ఆమెను వాడు అడిగాడు. " పురుగులు కొద్దిగా ఆ వంకాయను తినేస్తాయి "అని అంది ఆమె . "ఓహో! పురుగులు రుచి చూసినవి కాబట్టి అవి మంచివే రుచి చూస్తాయి" అని అనుకున్నాడు గుట్టడు .

వాడికి పచ్చిమిరపకాయల కారం తెలియదు.వాడు బీరకాయను చవిచూసినట్టే మిరపకాయను కొరికి చూశాడు. మిరపకాయ "కారం! కారం "అని మొత్తుకున్నాడు. వెంటనే ఆ మిరపకాయల స్త్రీ నవ్వుతూ వాడికి సీసాలో మంచినీళ్లను త్రాగడానికి ఇచ్చింది. వాడు నీళ్లను త్రాగి " ఈ కాయలు కూర వండుకొని తింటారా!" అని ఆమెను అడిగాడు. అప్పుడు ఆమె "ఇది కూరగా వండుకోరు .కానీ ప్రతికూరలో ఒకటి, రెండు వేస్తారు" అని అన్నది. వాడు వాటిని కారంగా ఉన్నవని కొనలేదు.

ఇంటికి వచ్చిన తర్వాత వాడి అవ్వ వాడిని చాలా తిట్టింది. " ఈ పుచ్చిన వంకాయలు తెస్తావా! నీకు బుద్ధి ఉందా ! ఆమె ఎవరో నిన్ను మోసం చేసింది "అని అంది." లేదమ్మా !మనకన్నా పురుగులు చాలా తెలివిగలవి. అవి మంచి కాయలనే తింటాయి" అని వాడు అన్నాడు. వాడి మాటలకి ఆమె తలపట్టుకుంది. వాడిని సంతకు వెళ్లి కూరగాయలు తెమ్మనడం తనదే బుద్ధి తక్కువ అనుకుంది. చివరకు ఇంట్లో ఉన్న టమాటా కూరను వండింది.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

## ఊరు మింగుతోందెవరు?!

అవును నిజమే
ప్రశ్నార్థకంగానే ఉంది.
మనుషులుండాల్సిన చోటు
శూన్యం ఆక్రమించేసింది.
తనువులన్నీ యంత్రాలై
మనసులు పాడైన ఇంజన్లైపోయాకా
ఏమౌంతుంది. కన్నీటి చిత్రమవ్వక.

మనుషులంతా
మమతల రాశుల్లా తిరిగిన ఊరు
మనసులులేని
మనుషులతో నీలుగుతోంది.

ప్రేమ పూలు పూసే
ఆ కుటుంబాలన్నీ
పట్నం బాట పట్టాకా...
ఇక ఏంముంటుందక్కడ?!

ఇంకేం ప్రశ్నించుకోవద్దు
మనమే నేరస్తులం.
ఊరును మింగిందేవరో కాదు.
నువ్వూ,నేనే... ష్ ష్...!



-కొత్తపల్లి మణీత్రినాథ రాజు.
9949389296

## ఎన్నెన్నో అందాలు

నిండు సూర్యోదయంతో
కోడి కూతలు
నీటిలో తెలియాడె పద్మాలు
ఆకర్షిస్తున్న ప్రకృతి అందాలు.

మిట్ట మధ్యాహ్న వేళ
చెరువు నీళ్ళతో దాహం తీర్చుకునే దుప్పిలు
ఆకలిని తరిమే ప్రకృతి ఫలాలు
విశ్రాంతినిచ్చే చెట్లనీడలు
ప్రకృతి ప్రసాదించే వరాలు

సూర్యస్త సమయాలు..
కిలకిల నవ్వులతో పక్షులు ఆడే ఆటలు
సాయంకాల సంతోష సంద్రపు అలలు
అందాలపుష్పాల పరిమళం వెదజల్లె ప్రదేశాలు

పండువెన్నెలతో
ఆకాశం విచ్చుకుంటున్న కలువ మొగ్గ
రాత్రి చుక్కలతో భూమంత సంబరం
ప్రకృతి పచ్చగుంటెనే..
మనిషైన జంతువైన
నేలమీద
జీవమై బతుకుతది

-యం. రేణుక
ఓఖఆూ మొదటి సంవత్సరం
ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల
మహబూబ్ నగర్

## తాళం తీశారని...

తాళం తీసేశారు కదా అని
కాళ్ళకు రెక్కలు కట్టుకుని
అనిపించిన చోటల్లా వాలిపోకు
కనిపించిన వారికల్లా
కైదండలు వేయకు
శత్రువు ఇంకా మడమ తిప్పలేదు
ముప్పు ఇంకా తప్పలేదు.
నిజమే!
ఇన్నాళ్లూ స్వేచ్ఛగా ఎగిరే మనసును
నాలుగ్గోడల నడుమ బంధీని చేశావు
ఊహల ప్రవాహానికి ఆనకట్ట వేశావు.
నిజమే!
ఇన్నాళ్లూ అడుగు బయటపడక
నీ పాదాలెంతగా మగ్గిపోయాయో!
నీ చేతి స్పర్శ లేక
అనురాగలతలెంతగా శుష్కించిపోయాయో!
కానీ శత్రువు నిన్నింకా తాకలేదంటే
నువ్వింత కాలం నిబంధనలకు లోబడి
అనుబంధాల లోగిలిలో స్వచ్ఛంగా ఉన్నావు.
అనురాగాల కౌగిలిలో వెచ్చగా ఉన్నావు.
నీ సన్నిధిలో సుమబాలలెంతగా పరిమళించాయో
నీ మమతల కోవెలెంత
పరవశించిందో గమనించావా?
టీకోత్సవం ముగిసి కవచకుండలాలు పెరిగే వరకు
అక్కరలేనిఊహల రెక్కలు
కత్తిరిస్తూనే ఉండు.
గృహసీమలో సురక్షితంగా ఉండు.



-సింగారపు రాజయ్య
9945744332

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 300వ రోజు 'ఉదరపోషణార్థం బహుకృత వేషం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'ఉదరపోషణార్థం బహుకృత వేషం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు,** 9441046839

## మన జాగ్రత్తలో....

ఏ పాటు పడినా
సాపాటు కొరకే
ఏ వేషం వేసిన
ఉదరపోషణకే..
గంగిరెద్దు నాడించి నా
దసరా వేషాలు వేసినా
చిలుక జోశ్యం చెప్పినా
అంతా పొట్టకోసమే...
ఈ నాడు అంతులేనివేషాలు
కాలే కడుపుకు కాదు
కోట్లు కూడ బెట్టటానికి
స్నేహం వేషం
తీయటి మాటల వేషం
ఏదైనా కావొచ్చు
ధ్యేయం ఒక్కటే..
అవతలి వారిని
బుట్టలో పెట్టి ఊరించి
ఎలా తాను ఎదగాలి?
టెక్నాలజీ పెరుగుదల
ఆన్లైన్ లావాదేవీలు
మోసాలకి మరింత దగ్గర దారి
సుఖం వెంటే కష్టం
సౌలభ్యం వెంటే మోసాలు
మన దురాశ మోసానికి పెట్టుబడి
మన జాగ్రత్తే మనకు శ్రీరామ రక్ష.



**– మోటూరి శాంతకుమారి,** 8106790978

## కుక్షి కై లక్ష పాట్లు!

ఉదకేయ బియ్యం నాస్తి!
దరికానరాని దారిద్ర్యం!
రచ్చకీడ్చే అతుకులబతుకు
పోషించాలంటే!
ఉష:కాలంతోమేలుకొని
అణాపైసలకోసం
అర్థం వేటలో దినమంతా
బహురకాల వేషాలు
కృత్రిమ నవ్వు పులిమి
తక్కుతూ తారుతూ
వేవేల రకాల వేషాలు
రోషావేశాలు చంపుకుని
కుక్షి కై లక్ష పాట్లు!
ఫిరాయించు ప్లేట్లు!?.
కూడు గూడు గుడ్డకై
కోటి ఆశల కోర్కెలు!
కోప తాపాలు అటకెక్కించి
సంసార సంద్రంలో మునకలు!
కోకొల్లలుగా
సాటివారికి ట్రిక్కులపేరుతో
విద్య పేరు తో బుట్టలో పెట్టే
లుప్త మవుతున్న పల్లె కళలు!?
గంగిరెద్దులా మారాలి!
కాకా బాకా ఊదాలి!
ఊగిసలాడే తీగపై
బంగారానికి మెరుగు పెట్టే నెపం
చిలుకజోస్యం పేర
పార్టీల అనుకూల జాతకం!
సోదిపేరుతో స్కామ్ కబ్జాలు!.
సవరాల జుట్టుకి స్టీల్ సామాన్లు!
ఘోస్ట్ రైటర్స్! నటులకి డూప్ !
ఉద్యోగం టి.వి.సినిమా ఛాన్స్ !
తెల్లారేసరికి మాంత్రికుడికి చిక్కె
చిలకా గోరింకలు!
ఆకలికేకలకు తప్పవు ల
నేటి బహుకృతవేషాలు!.

**–ఎ.రాజ్యశ్రీ,** 8985035283

## అప్రమత్తం

ఉదరం నిండాలంటే
బతుకు పండాలంటే
బహుకృత వేషం
అవసరం.
బహుకృత వేషమంటే
బతుకుదెరువుకు బహుళపనులు
ఒకే వృత్తిపై జీవనం సాగనప్పుడు
అవకాశమున్న ప్రతి వృత్తిలో ప్రవేశం.
మోసం చేసే ఆలోచనలతో
రకరకాల వేషాలతో
తిమ్మిని బమ్మి చేస్తూ
తమవల్ల కానిది లేదంటూ
నమ్మించే ప్రయత్నం.
మోసపోతున్న వారిని చూసైనా
జాగ్రత్త పడని నైజమే మోసగాని ఆయుధం
తెలుసుకునే లోపే బలి అయిపోతాం
విచారించడమే తరువాయి భాగం.
టెక్నాలజీ పెరిగినాక
మోసం ఎంతో సులువు
అజాగ్రత్తే చేస్తుంది కొంప కొల్లేరు
అప్రమత్తం కాకపోతే మోసగాళ్లదే రాజ్యం
టెక్నాలజీకి దగ్గరైతేనే
మోస నివారణ సులభం.



**–నాగిరెడ్డి అరుణ జ్యోతి,** 99661 81561

## బహుముఖ ప్రజ్ఞ

ఒక్క విద్య కాక
ఎన్నో విద్యలు నేర్చి
ప్రపంచ రికార్డు పొంది
పేరు తెచ్చుకుంటూ
ఎన్నో రంగాల కృషి
అది నేటి విద్య స్థితి
ఆనాడు ఉదర పోషణ
ఈ నాడు కీర్తి కాంక్ష కూడా.
నేటి కాలంలో టీవీ రేడియో
రంగాలలో ఎందరో కళా కారులు
కేవలం ఉదర పోషణకే కాదు
వినూత్న ప్రగతి కోసం స్ఫూర్తి.



**– నారుమంచి వాణి ప్రభాకరి,** 9949481823

## జానెడు పొట్టకోసం..

బతుకు అంగడిలో
బారులు తీరిన వారంతా
బుక్కెడు తిండికి
కట్టే వేషాలెన్నో
రక్తి కట్టించినా
కట్టకపోయినా
జానెడు పొట్టకోసం
జోరుగ నాటకం
ఆడాల్సిందే
ఏ పూటకాపూట
పబ్బం గడపాల్సిందే.



**–జాలిగామ నరసింహా రావు,** 9490128690

## విన్యాసాలు

కోటి తిప్పలు కూటి కొరకే
లక్షలు కాదు తినేది
అన్నం కావాలి
ఆహార కొరత అహంకారాలతో
కోట్ల మందికి ఆహార శూన్యత
ఆకలి తీర్చుకునేందుకు
ఎన్నో వేషాలు
శిథిలం అవుతున్న బతుకులు
యాచక వృత్తి కొందరు
పొట్టతిప్పలకు జర్రి పోతుల ఆటలు
పాములాటలు
ఎన్నో చిత్ర విచిత్రమైన విన్యాసాలు
ఈ కలి లో ఆకలి తీర్చుకునేందుకు.



**–వైద్య శేషారావు,** 9440408080

## మాడే కడుపు

చదువుకునే రోజుల్లో జల్సాలు
స్నేహితులతో సినీ గీతాలు
అమ్మాయిలతో సంబంధాలు
మరిచిన అమ్మానాన్నల బంధాలు.
వయస్సు గడిచి
ఏళ్ళు గడిచి
తిన తిండి లేక
ఆవిరైన అనుబంధాలు
కాలం చరిచిన చరుపుకు
ఆకలి మంటకు మాడే కడుపుకు
వేశాడు ఉదర పోషణార్థం
బహుకృత వేషం.



**–మన్నె లలిత,** 7416863289

## వెయ్యాలిగా మరి!

బాల్యంలో అంతా హాయి
అమ్మా నాన్నల సంరక్షణ
మనకికావలిసిన కోరికలన్నీ
తీరుతాయి వెంటనేక్షణంలో.
చదువులు
కావలిసిన బట్టలు
తినడానికి తిండి
మనకి ఏదికావాలంటే
ఆ పదార్థములతో గారాబంగాతిండి
యుక్తవయస్సుదాకా మనలను చూసే
పూర్తి బాధ్యత మన తల్లిదండ్రులదే.
ఆవయసులో మనకి ఏమి తెలియదు
అదే సమయంలో పిల్లలకి చదువుగాని
ఏదోవిద్యలో గాని నిష్ణాతుణ్ణి చేస్తారు
పెళ్లి భార్య పిల్లలు
తప్పదు ఏదో ఒకటి
జీవనపోషణ జరగాలికదా ప్రతిరోజూ
ఉద్యోగమో
ఏదోఒక వృత్తి చేయడమో
ఎక్కడోఒకచోట ఏదో పనికి కుదరడమో
నేర్చుకున్న తన వృత్తిలో స్థిరపడడమో
ఏదోవిధంగా కుటుంబభారం మోయడం
బ్రతుకు తెరువుకోసం
నచ్చిన వృత్తిని ఎంచుకోవడమో
ఆవృత్తిలో స్థిరపడడం
ప్రతిమనిషికీ జీవితంలో ఇది తప్పనిసరి.
ఈ వృత్తిలో మన కుటుంబానికి
కావలిసిన ధనం సరిపోనట్లయితే
ఆవృత్తి మారడమనేది చేయడంగాని
అదేపనితో బాటు ఖాళీ సమయంలో
మరో విధంగా సంపాదనా ప్రయత్నం
చేయడంగాని మనకు తప్పదుమరి
అందుకే పెద్దలు అన్నారు కాదామరి!
ఉదర పోషణార్థం కడుపునింపడానికి
బహుకృత వేషాలు తప్పవని!



**–తాతపూడి సోమశేఖర శర్మ,** 8328079336

# "కావ్య మయూరం" కవితాసంపుటి ఆవిష్కరణ

పాలమూరు పట్టణానికి చెందిన పంతులు సాయిపవన్ రచించిన "కావ్యమయూరం" కవితాసంపుటిని జిల్లా పరిషత్ చైర్మన్ ఎస్. స్వర్ణసుధాకర్ రెడ్డి ఆవిష్కరించారు. పాలమూరు సాహితి ఆధ్వర్యంలో పాలమూరు పట్టణంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సమావేశ మందిరంలో ఆగష్టు 16న జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో ఎంతోమంది కవులు నిరంతరం పుంఖానుపుంఖాలుగా రాయడం నిజంగా అభినందనీయమన్నారు. ఎంతో అనుభవమున్న కవిలా యువకవి పంతులు సాయిపవన్ చక్కని అంత్యప్రాసలతో కవిత్వం రచించాడన్నారు.

ఈ కవితాసంపుటిలోని విభిన్నఅంశాలపై రాసిన కవితాపంక్తులు ఆలోచింపజేస్తాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది వి.మనోహర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నవయసులోనే సాయిపవన్ కవిత్వం రచించడం అభినందనీయమన్నారు. సమాజాన్ని తట్టిలేపే విధంగా కవిత్వాన్ని ఆవిష్కరించడం ప్రశంసనీయమన్నారు. జిల్లా పరిషత్ ఉప కార్యనిర్వాహణాధికారి మొగులప్ప మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదివే వయసులో లోతైన కవిత్వం రాయడమనేది సమాజం పట్ల కవికున్న నిబద్ధత తెలియజేస్తుందన్నారు. రాబోయే కాలంలో ఇంకా మంచి కవిత్వాన్ని ఆవిష్కరించాలన్నారు. ప్రముఖ కవి బాదేపల్లి వెంకటయ్య పుస్తకసమీక్ష చేస్తూ మొలకగా మొలకెత్తిన సాయిపవన్ బలమైన కవిత్వాన్ని రచించడం అభినందనీయమన్నారు. సమాజంలోని వివిధ అంశాలపై రాసిన కవిత్వం నిజంగా సమాజమార్పును కోరే కవిగా సాయిపవన్ ఆవిష్కృతమయ్యాడన్నారు. కావ్యకర్త పంతులు సాయిపవన్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే కవిత్వం రాయడం అలవాటు చేసుకున్నానన్నారు. సమాజమార్పు కోసమే కవిత్వం రాస్తానన్నారు. ఈ కార్యక్రమానికి సంయోజకులుగా డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చిన్నచింతకుంట మండల పరిషత్ అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి, తిర్మలాపూర్ సర్పంచ్ సత్యం, కవులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ఎం.ఎస్.విజయకుమార్, పి.వెంకటన్న, పులి జమున తదితరులు పాల్గొన్నారు.







# ఇద్దరు పిల్లల నిబంధనపై బీకేయూ నేత గులాం మహ్మద్ కీలక వ్యాఖ్యలు

లక్నో, ఆగష్టు 18: యోగి ఆదిత్యానాథ్ సారధ్యంలోని యూపీ సర్కార్ తీసుకువచ్చిన జనాభా నియంత్రణ ముసాయిదా విధానాన్ని బీకేయు నేత గులాం మహ్మద్ జౌలా తోసిపుచ్చారు. యోగి ప్రతిపాదించిన ఇద్దరు పిల్లల విధానం ముస్లింలకు వర్తించదని స్పష్టం చేశారు. ముస్లింలు నాలుగు పెండ్లిండ్లు చేసుకోవచ్చని, దీని ప్రకారం నూతన చట్టానికి అనుగుణంగా కూడా తాము 8 మంది సంతానాన్ని కలిగి ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. యూపీ జనాభా నియంత్రణ బిల్లు 2021 ప్రకారం ఇద్దరు పిల్లలున్న జంటకు రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందిస్తుంది. జనాభా నియంత్రణ ముసాయిదా బిల్లుపై జులై మాసాంతానికి రాష్ట్ర లా కమిషన్‌కు 8500 నుంచి ఫీడ్‌బ్యాక్ అందింది. ఇక జులై 11న యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ నూతన జనాభా విధానం 2021-30ను ఆవిష్కరించారు. స్థిరమైన వృద్ధి సమతుల పంపిణీ కోసం జనాభా నియంత్రణ చేపట్టేందుకు ఈ బిల్లు కీలకమని యోగి పేర్కొన్నారు.




## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి



ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

### అంబరం

ప్రథమ బహుమతి విజేత

నీలిచీరను కట్టుకొని అరుణ వర్ణపు తిలకాన్ని దిద్దుకొని వేకువ కిరణాలను పంచుతుంది జీవులకు చైతన్యాన్ని పంచటానికై..!

పక్షుల కువకువలు ప్రభాత గీతికలను పాడేలా చేస్తూ భూపాలరాగాన్ని పలికిస్తుంటే తరువులతో చేతులు కలిపి నేస్తంగా మారుతుంది..!

మేఘమాలికలతో ఉయ్యాలలూగి మెరుపుకన్నెలతో చేరి ఉరుములు,పిడుగుల ధ్వనులతో సింహ నినాదాలు చేస్తూ నల్లనయ్య మేనులా నల్లగా మారి వరుణిడిని కురిపిస్తూ పుడమమ్మను సీమంతినిగా చేస్తూ మెరిపిస్తావ్..!

రేయి వెలుగులు చంద్రునితో చేరి,తారల మిలమిలలను పంచుతూ శ్వేతాంబరాన్ని ధరించి వగలు పోతుంటావ్..!
నేలమ్మకు పందిరిలా మారి అనంత విశ్వపు అంకురాలను సృజింప చేసే అంబరం ఆనందాలను పంచే అపూర్వ దృశ్యం..!!!!



**–కె.ఇ.నిలమంగై**

### అంబరమంటే సంబరమే నాకు!

ద్వితీయ బహుమతి విజేత

ఒక్కోసారి నింగంతా అలికినట్లు
నీలి నీలి రంగుని పులుముకుని
నయనానందకరంగా మురిపిస్తుంది
ఒక్కోసారి కాటుక ఒంపుకున్నట్లు
చీకటి పరదా చిక్కగా కప్పుకుని
కించిత్ భయాన్ని విసిరిపోతుంది
అయినా అంబరమంటే సంబరమే నాకు!
రసజ్ఞత కలిగిన హాలికుడెవరో
ఆకాశ క్షేత్రంలో నక్షత్రాల విత్తులు చల్లినట్లు
తళుకులీనే తారలను చూసినప్పుడు
మనసంతా మయూరమై నాట్యం చేస్తుంది.
జలజలా జలపాతంలా జారుతున్న
బంగారు సొనల వెన్నెల వెలుగులో
అంబరానికి అతికించిన నెలరేడును
తనివితీరా తన్మయత్వంతో చూసినప్పుడు
ఆనందంతో హృదయం విచ్చుకుంటుంది
అందుకే అంబరమంటే సంబరమే నాకు!
అంబరం...
అవనికి గొడుగు పడుతున్నట్లే
అనిపిస్తూంటుంది నాకెప్పుడూ!!



**–వాడపర్తి వెంకటరమణ** 81795 78895

# సుధామకు రంగనాయకమ్మ పురస్కారం ప్రదానం



సుధామను సత్కరిస్తున్న అతిథులు.

ప్రముఖ కవి ఆకాశవాణి పూర్వ కార్యక్రమ నిర్వహణ అధికారి సుధామకు తెలంగాణ సారస్వత పరిషత్ మంగళవారం ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ సాహితీ పురస్కారం ప్రదానం చేసింది. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని రూ.5 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సుధామాను ఘనంగా సన్మానించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు డా॥పి. సుమతీ నరేంద్ర అమ్మమ్మ ఎర్రంరెడ్డి రంగనాయమ్మ జ్ఞాపకార్థం 40 ఏండ్ల కిందట ఏర్పాటు చేసిన ఎండోమెంట్ నుంచి ఏటా ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి తెలిపారు.

డాక్టర్ కేవీ రమణాచారి ప్రసంగిస్తూ సుధామ కవిగా, వక్తగా, కార్టూనిస్టుగా, పత్రికా కామిష్టిగా, యువభారతి సంస్థలో ముఖ్యమైన కార్యకర్తగా తెలుగు భాష, సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్నారని అభినందించారు.

పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ ఆకాశవాణిలో వృత్తిరీత్యా తెలుగు భాష సాహిత్యాలపై అనేక ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేశారని గుర్తు చేశారు. సుధామ 'పద బంధం పారిజాతం' అనే అంశంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. పరిషత్ కోశాధికారి మంత్రి రామారావు వందన సమర్పణ చేశారు.



ఈనెల 14న శ్రీ త్యాగరాయ గానసభ మెయిన్ హాలులో శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహించిన ప్రముఖ సాహితీవేత్త నాగభైరవ కోటేశ్వరరావు జయంతి సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జి.దేవీప్రసాద్, సభాధ్యక్షులు కళా వి.ఎస్.జనార్ధనమూర్తి, గౌరవ అతిథి పొత్తూరి సుబ్బారావు, విశిష్ట అతిథి బిజేపీ నాయకులు వినయకుమార్, రఘుశ్రీ తోట శ్రీలక్ష్మి తదితరులు.

# నకిలీ వ్యాక్సిన్ల గుర్తింపు.. డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక

లండన్, ఆగష్టు 18: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో అందుబాటులోకి వచ్చిన వ్యాక్సిన్లకు నకిలీలు కూడా ముంచెత్తుతున్నాయి. నకిలీ కోవిషీల్డ్ వ్యాక్సిన్లను (ఈజీనివ ఎజీఇఇతినివ) భారతదేశం, ఉగాండాలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గుర్తించింది. ఈ నకిలీ వ్యాక్సిన్‌ను అధీకృత వ్యాక్సిన్ సెంటర్ నుంచి తీసుకువెళ్లి పలువురికి ఇచ్చినట్లు తేలింది. 5 ఎంఎల్, 2 ఎంఎల్ వయల్స్ 10 డోసులు నకిలీవిగా తేలాయి. నకిలీ కోవిషీల్డ్ బయటపడటంతో వైద్య ఉత్పత్తుల గురించి డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక జారీ చేసింది. తమ కంపెనీ 2 ఎంఎల్ వయల్‌లో కోవిషీల్డ్ వ్యాక్సిన్‌ను సరఫరా చేయడం లేదని సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) స్పష్టం చేసింది. జాబితాలో పేర్కొన్న వ్యాక్సిన్ నకిలీదని సీరం ఇన్‌స్టిట్యూట్ నిర్ధారించినట్లు డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.

ఒకవేళ నకిలీ కరోనా వ్యాక్సిన్‌ను గుర్తించినట్లయితే వెంటనే నాశనం చేయాలని డబ్ల్యూహెచ్ఓ సూచించింది. నకిలీ టీకాలు ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యానికి ప్రధాన ముప్పు అని పేర్కొన్నది. డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ సర్వేలెన్స్ అండ్ మానిటరింగ్ సిస్టం నకిలీ వ్యాక్సిన్‌లను గుర్తించింది. ఉగాండాలో దొరికిన నకిలీ కోవిషీల్డ్ వయల్‌లో 5 మిల్లీలీటర్ల 10 డోసులు ఉన్నాయి. దీనిపై బ్యాచ్ నంబర్ 4121జి040, గడువు తేదీ ఆగస్టు 10 అని వ్రాయబడింది. ఇవి కూడా నకిలీయే అని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.










## కవన కిరణాలు

### పోటీ ఫలితాలు

*కవన కిరణాలు తెలుగు సాహితీ సమాఖ్య సంస్థ 2021 సంవత్సరపు 75 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ కవితల పోటీలో మొత్తం 281 మంది కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.*

### విజేతల వివరాలు

**ప్రథమ బహుమతి 2000/-రూ - శ్రీమతి రాధారాణి.**
**ద్వితీయ బహుమతి 1500/-రూ - శ్రీ వద్దాది రవికాంత్ శర్మ.**
**తృతీయ బహుమతి 1000/-రూ - శ్రీమతి పి.వి.శేషారత్నం.**

**విశిష్ట బహుమతి 500/-రూ (ఆరుగురికి)**

1) శ్రీమతి బి.కళాగోపాల్.
2) శ్రీమతి ఉప్పల పద్మ
3) శ్రీ అన్నం శివకృష్ణ ప్రసాద్
4) శ్రీ శ్రీ.ఎ.ఎ.రాజా
5) శ్రీ మారుగొండ సాయిలు
6) శ్రీ గుండేటి రమణ

**ప్రత్యేక ప్రశంసా బహుమతి 500/-రూ కుమారి సిరిసిల్ల రాజేశ్వరి.**

వీటితోపాటు ప్రోత్సాహ బహుమతులుగా 45 మందికి గ్రంథ వితరణ అందించేయనున్నట్లు, పోటీలో పాల్గొన్నవారందరికీ ప్రశంసా పత్రాలు అందచేశాము.
ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శ్రీ నేమాని ప్రసాద్, శ్రీమతి గంజాం భ్రమరాంబ గార్లు వ్యవహరించారు.
న్యాయ పరిశీలకులుగా శ్రీ కరణం కళ్యాణ్ కృష్ణ కుమార్, శ్రీమతి సుకన్య వేదం గార్లు వ్యవహరించారు.
కార్యనిర్వాహకులుగా, శ్రీ జి.జి.రావు, శ్రీమతి విజయ రామగిరి, శ్రీమతి జూపూడి సుధారాణి, శ్రీమతి యం.టి.స్వర్ణలత, శ్రీమతి స్వాతికృష్ణ సన్నిధి, శ్రీమతి గీతాశైలజా గార్లు వ్యవహరించారు.

*పోటీలకు సలహాదారుగా వ్యవహరించిన నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాస్ గారికి... సంస్థ తరపున ప్రైజ్ మనీ అందించిన శ్రీ విసురజ గారికి ధన్యవాదాలు.*
విజేతలందరికీ అభినందనలు.



**–శివమంచాల**
'కవన కిరణాలు' సంస్థాపక అధ్యక్షులు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.